RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 65 పేజీలు - 08 ఆదివారం 01 ఫిబ్రవరి 2026

## శంషాబాద్‌లో భారీగా గంజాయి స్వాధీనం

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి31:** శంషాబాద్ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులు శనివారం మధ్యాహ్నం భారీగా విదేశి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేసిన అధికారులు వారి వద్ద నుంచి రూ. 9.5 కోట్ల విలువైన 27 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ట్రాలీ బ్యాగుల్లో ఉంచి తరలిస్తుండగా పట్టుకున్నారు. నలుగురు విదేశాల నుంచి వచ్చిన నలుగురితో పాటు గంజాయిని తీసుకు వెళ్లేందుకు వచ్చిన మరో ముగ్గురిని డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

- స్థానికంగా గెలిచే వారికే పార్టీ అండ
- రెబల్స్ బెడద లేకుండా చూసుకోండి
- కాంగ్రెస్ నేతలకు సూచించిన సిఎం రేవంత్



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 31:** మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, గెలుపు గుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతలను కోరారు. ఈ మేరకు పలు సూచనలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో తదుపరి కార్యాచరణపై పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు, నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం వద్దు. భాజపా, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలి. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే. రెబల్స్ విషయంలో మాట్లాడి సమన్వయం చేసుకోవాలి. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక మిగతా2లో...



## మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

- శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నిక
- కార్యక్రమానికి దూరంగా శరద్ పవార్, సుప్రియా సూలె
- అభినందనలు తెలిపిన ప్రధాని మోడీ

**తొలి అక్షరం/ముంబై,31:** నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత, రాజ్యసభ ఎంపీ, దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా శనివారంనాడు ప్రమాణ స్వీకారం చేశారు. ముంబైలోని లోక్‌భవన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమె చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మరో ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, మహాయుతి మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు. ఎన్‌సీపీ నేతలు శరద్ పవార్, ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించడంతో ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం పగ్గాలను సునేత్ర చేపట్టారు. విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్ ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎంపీ అయిన ఆమె శనివారం ఉదయం ముంబైలోని విధాన్ భవన్‌కు మిగతా2లో...

## గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

- పుష్కరఘాట్లు, రహదారుల విస్తరణపై దృష్టి
- రాష్ట్రంలో రోడ్ల నిర్వహ; మరమ్మత్తులకు పెద్దపీట
- 2036 ఒలింపిక్స్ నాటికి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దాలి
- విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సిఎస్ సమీక్ష



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 31:** వచ్చే సంవత్సరం జరిగే గోదావారి పుష్కరాలకు పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల విస్తరణ, ఇతర మౌలిక వసతుల కల్పనకు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గోదావారి నది తీరంలో దాదాపు 69 ప్రాంతాలలో 74 పుష్కర ఘాట్లను గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరితగతిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి తగు ప్రతిపాదనలు మిగతా2లో...



## అంబటి రాంబాబుకు జగన్ ఫోన్

- దాడిని తీవ్రంగా ఖండించిన మాజీ సిఎం


**తొలి అక్షరం/గుంటూరు,జనవరి 31 :** అంబటి రాంబాబుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ చేశారు. టీడీపీ దాడికి గురైన అంబటిని పరామర్శించి ధైర్యం చెప్పిన వైఎస్ జగన్.. రాష్ట్రం జంగిల్‌రాజ్‌గా మారిపోయిందన్నారు. చంద్రబాబు ఆటవిక రాజ్యాన్ని నడుపుతున్నారని వైఎస్ జగన్ మిగతా2లో...

## నేడు పార్లమెంట్ ముందుకు కేంద్ర బడ్జెట్

ఉదయం 11 గంటలకు బడ్జెట్ ప్రసంగం

ప్రవేశ పెట్టనున్న నిర్మలాసీతారామన్

ఆదాయపు పన్ను మినహాయింపులపైనే అందరి చూపు




## మేడారం జాతరలో పోలీసుల పనితీరు భేష్

అధునిక టెక్నాలజీతో సమర్థంగా విధులు

రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడి




**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 31:** అదివాసీల సహకారంతో పోలీసులు జాతరలో ఉత్సాహంగా విధులు నిర్వహించారని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. వనదేవతలను దర్శించుకున్న డీజీపీ.. కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించిన సీసీ పుటేజీల్లో మిగతా2లో...

## ముగిసిన జనజాతర

- గద్దెలు వీడిన అమ్మవార్లు
- చిలకలగుట్ట చేరిన సమ్మక్క
- జయజయధ్వానాలతో వీడ్కోలు
- ఇళ్లకు పయనమైన భక్త జనం




## సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు

నందినగర్ ఇంటికి నోటీసులు ఎలా అతికిస్తారు

అయినా మీకు విచారించే అధికారం లేదు

ఎర్రవెల్లిలో అందుబాటులో ఉంటానని చెప్పాను

నేరుగా నోటీసులు ఇవ్వకుండా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారు

ఎసిపికి తనను విచారించే అధికారమే లేదు

జూబ్లీహిల్స్ ఎసిపికి మాజీ సిఎం కెసిఆర్ లేఖ

నేటి విచారణకు అందుబాటులో ఉంటానని వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 31:** జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని మాజీ సిఎం కేసీఆర్ పేర్కొన్నారు. నోటీసుల జారీలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పోలీసులు ఉల్లంఘించారని ఆరోపించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు ఆరు పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. క్రైమ్ నంబర్ 243/2024 విచారణకు సంబంధించి తన వివరణను ఈ లేఖలో వివరించారు. ముఖ్యంగా నందినగర్ నివాసం గోడపై నోటీసు అతికించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం మిగతా2లో...

## కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు

పోలీసుల అత్యుత్సాహం ఎవరి కోసం

తెలంగాణ తెచ్చిన పెద్దాయననే అవమానిస్తారా

ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్




## కరీంనగర్ మేయర్ సీటు మాదే

- కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా




## బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి

గతంలో లాగా కాకుండా కేటాయింపులు పెరగాలి

అన్యయాం జరిగితే బిజెపి ఎంపిలదే బాధ్యత

మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్



# గెలుపు గుర్రాలకే కాంగ్రెస్ టిక్కెట్లు

(మొదటి పేజీ తరువాయి)

దృష్టి పెట్టాలి. నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలి' అని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికల సర్వే నివేదికలను టీపీసీసీ చీఫ్ సీఎంకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవాలని రేవంత్ రెడ్డి టార్గెట్ నిర్దేశించారు. రెబల్స్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. ఫిబ్రవరి 3 నుంచి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. తెలంగాణలో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ ఎన్నికల్లో జీహెచ్‌ఎంసీకి మినహాయింపునిచ్చారు. మొత్తం 2,996 వార్డులకు పోటీ జరగనుంది. ఈనెల 28 నుంచి ప్రారంభమైన నామినేషన్ల పక్రియ శుక్రవారంతో ముగిసింది. శనివారం నాడు నామినేషన్ల పరిశీలన జరుగనుంది. ఫిబ్రవరి మూడున నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. ఆ రోజు ఉదయం 7:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు రానున్నారు. ఆయన వచ్చాక పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించి మున్సిపల్ ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించనున్నట్లు సమాచారం. ఆపై ఫిబ్రవరి 3 నుంచి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న సీఎం.. పలు జిల్లాల్లో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొననున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# గోదావరి పుష్కరాలకు సిద్ధం కండి

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించాలని అధికారులను సి.ఎస్ ఆదేశించారు. విజన్ 2047 లక్ష్య సాధనలో భాగంగా ఈ రోజు రెవెన్యూ, దేవాదాయ, పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీస్ లు, రవాణా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలపై డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో ఉన్నతాధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి, సౌకర్యాల కల్పన, పరిపాలన వ్యవస్థ పై సమీక్షించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం, ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలోని ఇతర ప్రముఖ దేవాలయాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు అందిస్తున్న వసతులు, భద్రత, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా యాదగిరిగుట్ట, వేములవాడ, భక్తుల రద్దీ ఉండే ఇతర ఆలయాల్లో దర్శన క్యూల నిర్వహణ, పార్కింగ్, త్రాగునీరు, టాయిలేట్స్, పరిసరాల పరిశుభ్రత నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. హ్యాండ్లూమ్స్, టెక్స్టైల్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేనేత కళాకారులకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని సూచించారు. రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ సమీక్షా సమావేశంలో భూ భారతి రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు, భూ సర్వేలు, సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయ భవనాల నిర్మాణం, ఇ-ఫైలింగ్, లైసెన్స్డ్ సర్వేయర్లు, 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యసాధన, తదితర అంశాలపై సమీక్షించారు. క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, సెట్విన్, రాష్ట్ర మ్యూజియమ్స్ అభివృద్ధి, ఆయా శాఖల పనితీరుపై సి.ఎస్ సమీక్షించారు. ప్రస్తుత కార్యక్రమాల అమలు స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికల, తెలంగాణ 2047 విజన్ లక్ష్య సాధన పై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో రాబోయే 2036 ఒలింపిక్స్ నాటికి రాష్ట్రంలో అంతర్జాతీయ క్రీడాకారులను అధిక సంఖ్యలో తయారు చేసే విధంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ విధంగా క్రీడల అభివృద్ధికి యువతను గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల వైపు మరింత ఆకర్షించే విధంగా విధానాలను రూపొందించాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. యువజన సర్వీసులు శాఖ ద్వారా అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ శిక్షణ, యువత సంక్షేమ కార్యక్రమాలు లక్ష్య సాధనలో ఉండేలా పటిష్ఠంగా అమలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, కోచింగ్ సదుపాయాలు, ప్రోత్సాహకాలు, అవార్డులు, ఆర్థిక సహాయంపై సమీక్ష జరిపి ప్రతిభావంతులైన క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా సీఎం కప్ వాట్సాప్ యాప్ ను ఆవిష్కరించారు. పర్యాటక రంగంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చారిత్రాత్మక ప్రదేశాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని అన్నారు.

# మహా ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. అక్కడ ఎన్సీపీ ఎమ్మెల్యేలతో సునేత్రా పవార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమెను ఆ పార్టీ శాసనసభా పక్ష నాయకురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజ్యాంగం ప్రకారం శాసన సభ లేదా శాసన మండలికి ఎన్నిక కాని వ్యక్తి కూడా మంత్రి పదవి చేపట్టవచ్చు. అయితే ఆ వ్యక్తి ఆరు నెలల్లోగా శాసనసభ సభలేదా శాసనమండలి సభ్యుడిగా ఎన్నికవ్వాలి. దీనికి ముందు, శనివారం ఉదయం ఎన్‌సీపీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర పవార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లెజిస్లేటివ్ బిల్డింగ్‌లో జరిగిన సమావేశంలో సునేత్ర పేరును ఎమ్మెల్యే దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, ఎన్‌సీపీ మంత్రి ఛగన్ భుజ్‌బల్ బలపచారు. అనంతరం ఏకగ్రీవంగా పార్టీ శాసనసభాపక్ష నేతగా సునేత్ర ఎన్నికయ్యారు. సునేత్ర పవార్ డిప్యూటీ సీఎం పదవితో చేపట్టంతో అజిత్ పవార్ చేపట్టిన శాఖలను కూడా ఆమెకు అప్పగించనున్నారని తెలుస్తోంది. అయితే అజిత్ పవార్ చేతిలోని ఆర్థిక శాఖను మాత్రం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తన వద్దే ఉంచుకోనున్నారని, దీనికి బదులుగా మరో శాఖను ఆమెకు అప్పగిస్తారని తెలుస్తోంది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సునేత్ర పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం, దివంగత అజిత్‌దాదా పవార్ కలలను సాకారం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తారనే నమ్మకం తనకుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు.

# అంబటి రాంబాబుకు జగన్ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు దుర్మార్గాలు రోజురోజుకూ పెరిగిపోయాయన్న వైఎస్ జగన్.. ఉద్దేశపూర్వకంగానే హత్యాయత్నం, దాడులకు దిగారన్నారు. ప్రజలన్నీ చూస్తున్నారు. ఈ అరాచకపాలనను ప్రజలు సహించబోరు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షకుల్లా వ్యవహరించారు. అంబటికి పార్టీ మొత్తం అండగా ఉంటుంది' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అంబటిపై టీడీపీ గూండాల హత్యాయత్నాన్ని వైఎస్సార్‌సీపీ సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేసింది. లడ్డూ విషయంలో సిట్ ల్యాబ్ రిపోర్టుల ఫలితాలతో అడ్డంగా దొరికిపోవడంతో బాబు హింసను రాజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఆరోపించింది. దాంట్లో భాగంగానే వరుస దాడులు జరుగుతున్నాయన్న వైఎస్సార్‌సీపీ.. పథకం ప్రకారమే అంబటిపై హత్యాయత్నం చేశారని పేర్కొంది. అంబటిపై హత్యాయత్నాన్ని కేంద్ర హోంశాఖ దృష్టికి వైఎస్సార్‌సీపీ తీసుకెళ్లనుంది. కేంద్ర హోంశాఖకు వైవీ సుబ్బారెడ్డి లేఖ రాయనున్నారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలి

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 31:** కేంద్ర ప్రభుత్వం నేడు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో తెలంగాణను నిర్లక్ష్యం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానికి వివక్ష ఉందన్నారు. దానిని సరిదిద్ది కేటాయింపులు చేయాల్సి ఉందన్నారు. తెలంగాణపై బడ్జెట్‌లో వివక్షత చూపిస్తే బీజేపీ ఎంపీలే బాధ్యత వహించాలని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఈ పౌర్ణమి తెలంగాణకు వెలుగులు తెస్తుందా..? , చీకటి ఇస్తుందా..? చూడాలని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతిసారీ తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా తెలంగాణకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమం పట్ల ప్రధాని నరేంద్రమోదీకి వ్యతిరేకత ఉందన్నారు. రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి తెలంగాణ ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని సూచించారు. ఈ విషయంపై కేంద్రానికి, బీజేపీకి చివరిసారిగా గుర్తు చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాసంస్థల స్థాపనకు మోదీ ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు తెలంగాణకి వస్తే తాము గౌరవంగా కలుస్తున్నామని ప్రస్తావించారు. పక్క రాష్ట్రాలకి నిధులు కేటాయిస్తే తాము తప్పు పట్టడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# నేడు పార్లమెంట్ ముందుకు కేంద్ర బడ్జెట్

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి 31 :** కేంద్రమంత్రి నిర్మలా సీతరామన్ ఆదివారం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. ఈ వార్షిక బడ్జెట్ ఎప్పటిలాగే కొన్ని మెరుపులు, మరికొన్ని విరుపులు ఉండేలా ఉంటుందన్న చర్చ సాగుతోంది. పెద్దగా ప్రభావితం కాకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశ పెడతారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం సభ వాయిదా పడుతుంది. అయితే ఆదివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర ఆర్థిక బ్జడెట్ 2026 కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులు తమకు ఊరట లభించేలా బ్జడెట్ ఉంటుందనే ఆశతో ఉన్నారు. వారి ఆశలు నిజం చేసే దిశగానే కేంద్రం బ్జడెట్ ఉండనుందని సమాచారం. పన్నుల విషయంలో కీలక మార్పులు జరగవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బడ్జెట్ 2026లో ఆదాయపు పన్ను నిబంధనలో పలు మార్పులు రానున్నాయి. ముఖ్యంగా ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, సీనియర్ సిటిజన్లకు లాభం చేకూరేలా ఈ మార్పులను కేంద్రం తీసుకువస్తుందని సమాచారం. పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేయడం, పన్ను విషయంలో భారాన్ని తగ్గించడం, పారదర్శకత, డిజిటల్ పన్ను వ్యవస్థను ఎంచుకోవడానికి ఎక్కువ మందిని ప్రోత్సహించడమే లక్ష్యంగా బడ్జెట్ ఉండనుందన్న వార్తలు వస్తున్నాయి. పాత ఆదాయపు పన్ను చట్టం 1961 నుంచి.. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 వరకు సరళమైన పరివర్తనలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. సత్వర పన్ను వాపసులు, సరళీకృత సమ్మతి కీలక లక్ష్యాలుగా ఉండనున్నాయని సమాచారం. వార్షిక సమాచార ప్రకటన, పన్ను చెల్లింపుదారుల సమాచార సారాంశం వంటి వ్యవస్థలు పన్ను దాఖలును సులభతరం చేశాయి. డిజిటల్ వ్యవస్థను మరింత నమ్మదగినదిగా, పారదర్శకంగా మార్చడంపై బడ్జెట్ 2026 దృష్టి సారించే అవకాశముంది. ఏఐని సరిగ్గా ఉపయోగించినట్లయితే పన్ను రిటర్న్‌లను ఆటోమేటిక్‌గా దాఖలు చేయొచ్చని, లోపాలను తగ్గించవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పన్ను వాపసుల కోసం రియల్‌టైమ్ ట్రాకింగ్ వ్యవస్థ కూడా సాయపడనుంది. ఆదాయపు పన్ను కేసుల వేగవంతమైన పరిష్కారంపై ప్రాధాన్యం, క్రిప్టో, డిజిటల్ ఆస్తులపై స్పష్టమైన నియమాలకు ఉపయోగ పడుతుంది. మరోవైపు.. కొత్త పన్ను విధానం వచ్చినప్పటికీ కొన్ని అంశాల్లో పాత పన్ను విధానం అందుబాటులో ఉంటుందని సమాచారం. ముఖ్యంగా గృహ రుణాలు, బీమా ప్రీమియంలు, పదవీ విరమణ పొదుపులు, ఇతర పెట్టుబడులకు సంబంధించిన పన్ను తగ్గింపులకు సంబంధించి పాత విధానాలే ఉంటాయని తెలుస్తోంది. బాగా పన్ను రాయితీ కలిగిన వారు పాత పన్ను విధానం నుంచి ప్రయోజనం పొందడం కొనసాగించవచ్చు. అయితే తక్కువ పన్ను మినహాయింపులు ఉన్న వ్యక్తులు కొత్త విధానాన్ని మరింత ఆకర్షణీయంగా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు. సరైన విధానాన్ని ఎంచుకోవడం ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఒక ముఖ్యమైన నిర్ణయం అవుతుంది. విద్యా, గృహ ఖర్చులు, రోజువారీ జీవన వ్యయాలను నిర్వహించే కుటుంబాలకు ఈ మార్పులు ఆర్థికంగా ఊపిరి పీల్చుకునే అవకాశాన్ని అందిం చవచ్చు. 2026లో ఆదాయపు పన్ను నియమాల మార్పు నుంచి సీనియర్ సిటిజన్లు కూడా ప్రయోజనం పొందవచ్చు. ముఖ్యంగా పెన్షన్ ఆదాయం, వాటి వడ్డీ ఆదాయాలపై సరళీకృత పన్ను విధించడం ద్వారా పన్ను దాఖలును సులభతరం చేస్తాయి. ఏది ఏమైనప్పటికీ.. ట్యాక్స్ ప్లేయర్లకు కేంద్రం శుభవార్త చెప్పనుందని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. గత సంవత్సరం ప్రవేశ పెట్టిన పన్ను విధానంపెద్దగాప్రయోజనకారిగాలేదన్నవిమర్శలు వచ్చాయి.

# కెసిఆర్ లేని ఇంటికి నోటీస్ ఎలా అంటిస్తారు

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 31:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సిట్ రెండోసారి నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసును నందినగర్‌లోని ఆయన నివాసం గోడకు అతికించడంపై ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. 'ఎక్స్' వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంటి? కేసీఆర్ స్వయంగా తానుంటున్న నివాసం చిరునామాతో పోలీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత కూడా.. ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గోడకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణం. ఇది అహంకారం కాకపోతే మరేమిటి! 65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దే విచారించాలన్న నిబంధనను కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అసలు పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. లేదా ముఖ్యమంత్రి చేతిలో కీలుబొమ్మల్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేదిస్తామని.. ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచారణ కొనసాగిస్తోంది. ఈ కేసు విచారణలో భాగంగా తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు సిట్ అధికారులు నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గేటుకు నోటీసులు అంటించి.. పైశాచిక ఆనందం పొందడం దారుణం' అని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇది కేవలం 'పైశాచిక ఆనందం' పొందడమేనని కేటీఆర్ విమర్శించారు. చట్టం, న్యాయంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అక్రమ కేసులను ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి చేస్తోన్న ప్రతి తప్పుడు పనిని ప్రజల ముందు పెడతామని, సమయం వచ్చినప్పుడు ప్రజలే బుద్ధి చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు.

# ముగిసిన జనజాతర

**తొలి అక్షరం/మేడారం,జనవరి 31:** మేడారం గద్దెపై కొలువై.. మూడు రోజులుగా పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల నడుమ పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మవారిని సాగనంపే క్రతువులో గిరిజన సంప్రదాయ సంగీత వాయిద్యాల చప్పుళ్లు.. కొమ్ముబూర శబ్దాలకు భక్తులు నృత్యాలు చేస్తుండగా.. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా గద్దెలపై కొలువై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతంలోని గుళ్లకు తీసుకెళ్లారు. సమ్మక్కను బయటకు తీసుకొచ్చిన సందర్భంలో భక్తులంతా 'సమ్మక్క తల్లికి జై.. అందరినీ సల్లంగ చూడమ్మ'.. అని వేడుకుంటూ భక్తిపారవశ్యంతో ఓలలాడారు. అనంతరం రాత్రి 7 గంటల సమయంలో డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ దేవతల వనప్రవేశం కార్యక్రమం ఆరంభమయ్యింది. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే ఈ మహాఘట్టం జనవరి 28 నుంచి 31వరకు జరుగగా.. శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చారు.

## మేడారం జాతరలో పోలీసుల పనితీరు భేష్

(మొదటి పేజీ తరువాయి)

జాతరలో భక్తుల రద్దీ, జాతరకు వచ్చే దారుల్లో ఉన్న ట్రాఫిక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే జాతరలో పిల్లలు, వృద్ధులు తప్పిపోతే అచూకీ తెలుసుకోవడానికి గత జాతరల్లో జాప్యం జరిగేదని, కానీ ఈ జాతరలో కొత్తగా చైల్డ్ ట్రాక్ మేనేజ్‌మెంట్ సిస్టం అనే కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టి పిల్లలు, వృద్ధుల చేతులకు హ్యాండ్ బ్యాండ్ పెట్టడం ద్వారా క్యూఆర్ కోడ్ ద్వారా తప్పిపోయిన పిల్లలు, వృద్ధులను కనుక్కోవడం సులువ గా మారిందన్నారు తద్వారా బాధితులతో పాటు పోలీస్‌శాఖకు సంతృప్తిని కల్గించం దన్నారు. డ్రోన్ లను ఏర్పాటు చేయడం ద్వారా జాతరలో ప్రతీ మూలకు జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలిం చేందుకు అనువుగా మారిందన్నారు. డీజీపీ వెంట మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, వరంగల్, రామగుండం పోలీస్ కమిషనర్లు సన్‌ప్రీత్ సింగ్, అంబర్ కిషోర్ ఝా తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం మార్గదర్శకాలు ఉల్లంఘించిన పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నోటీసులు అతికించడం రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ స్పష్టం చేశారు. 65 ఏళ్ల దాటిన వ్యక్తులను.. వారి నివాసం వద్దే విచారించాలని చట్టం చెబుతోందని గుర్తు చేశారు. తాను ప్రస్తుతం ఎర్రవల్లి నివాసంలో ఉంటున్నానని, అక్కడే విచారణ జరపాలని పోలీసులకు స్పష్టంగా తెలిపారు. ఈ సందర్భంగా సతేందర్ కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ కేసు తీర్పును లేఖలో ఉటంకించారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకు, సీఆర్పీసీ సెక్షన్ 160 కింద జారీ చేసే నోటీసులకు ఎలాంటి సంబంధం లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం నివసిస్తున్న చిరునామాలోనే విచారణ జరపాలని పార్లమెంట్ చట్టం స్పష్టంగా చెబుతోందని తెలిపారు. హరీష్ రావుకు జారీ చేసిన నోటీసుల విషయంలో పోలీసులు వేర్వేరు ప్రమాణాలు పాటిస్తున్నారని కేసీఆర్ విమర్శించారు. ఈ తరహా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని హెచ్చరించారు. పోలీసుల తీరు తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తి సహకారం అందిస్తానని కేసీఆర్ వెల్లడించారు. ఫిబ్రవరి 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నందినగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. 'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశిరచిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది' అని కేసీఆర్ తన లేఖలో సూచించారు. 'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘించడమే. నేను మీ పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుతో నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎలక్షన్ అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారు అన్నదే ముఖ్యం. నేను కొన్ని సంవత్సరాలుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నాను అన్నది నిర్వివాద అంశం. అక్కడే నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది' అని పేర్కొన్నారు.

# కరీంనగర్ మేయర్ సీటు మాదే..: కేంద్రమంత్రి బండి సంజయ్ ధీమా



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి 31:** కరీంనగర్ మేయర్‌తో పాటు మూడు చైర్మన్ పీఠాలు తమవేనని బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం, కరీంనగర్ కార్పొరేషన్ డివిజన్ ఇంచార్జ్‌లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు సమావేశంలో బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడమే మా లక్ష్యం. గెలిచే చోట కార్యకర్తలకే సీట్లు ఇస్తున్నాం. గెలిచే అవకాశం లేనిచోట మాత్రమే ప్రత్యామ్నాయ నేతలకు టిక్కెట్లుటిక్కెట్ రాని వారికి నామినేటెడ్, పార్టీ పదవులతో న్యాయం చేస్తాం. తొందరపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. తప్పుడు ప్రచారాలు నమ్మకండి. డివిజన్లలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీని గెలిపించండి' అని పిలుపునిచ్చారు. ఇదిలావుంటే కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన పక్రియ కొనసాగింది. శనివారం డివిజన్ల వారీగా వచ్చిన నామినేషన్లను వేరు చేసి ఒక్కొక్కటిగా రిటర్నింగ్, సహాయ అధికారులు పరిశీలించారు. మొత్తం 1,257 నామినేషన్లు వచ్చాయి. దీనికి 736 మంది దరఖాస్తు చేశారు.

# కేసీఆర్‌పై సిట్ నోటీసులు ప్రజాస్వామ్యంపై దాడి

- జిల్లా వ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు
- ఆదివారం ఉదయం 10 గంటలకు నల్ల బ్యాడ్జీలతో ఆందోళనలు
- కేసీఆర్ సేవా దళ్ జిల్లా అధ్యక్షులు బోడగం చంద్రారెడ్డి




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 31:** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రాష్ట్ర ఆవిర్భావ శిల్పి గౌరవనీయులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో సిట్ నోటీసులు జారీ చేయడం తీవ్రంగా ఖండించదగిన చర్యగా బీఆర్ఎస్ జిల్లా పార్టీ అభివర్ణించింది. ఇది పూర్తిగా రాజకీయ కక్షతో కూడిన చర్యగా ప్రజలు భావిస్తున్నారని పార్టీ నేతలు స్పష్టం చేశారు.రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 10.00 గంటలకు జిల్లా పరిధిలోని అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో సిట్ నోటీసులకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి, రాస్తా రోకోలు, శాంతియుత నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కేసీఆర్ సేవా దళ్ జిల్లా అధ్యక్షులు బోడగం చంద్రారెడ్డి మాట్లాడుతూ,"తెలంగాణ సాధన నుంచి నేటి అభివృద్ధి దశ వరకు కేసీఆర్ సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచేవి. అలాంటి నాయకుడిపై సిట్ నోటీసులు ఇవ్వడం ప్రజల మనోభావాలను అవమానించడమే. రాజకీయ కుట్రలతో కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలను బీఆర్ఎస్ శ్రేణులు తిప్పికొడతాయి" అని అన్నారు.కేసీఆర్‌కు అండగా నిలిచి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతియుతంగా కానీ దృఢంగా నిరసనలు చేపట్టాలని ఆయన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# సిట్ నోటీసులు ప్రజాస్వామ్యానికి సవాల్ కేసీఆర్‌కు అండగా ఉద్యమం

- ఆదివారం నల్ల బ్యాడ్జీలతో నిరసనలు: బత్తిని అనిల్




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 31** నెల్లికుదురు మండల కేంద్రంలోని ఎర్రబెల్లి గూడెం గ్రామానికి చెందిన బత్తిని అనిల్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బతీయాలనే లక్ష్యంతో సిట్ నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రశ్నించే చర్యగా నెల్లికుదురు ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు బత్తిని అనిల్ అభివర్ణించారు. ఈ వ్యవహారం పూర్తిగా కుట్రపూరితమని, ప్రజల తీర్పును అంగీకరించలేని శక్తుల ఆలోచనగా ఆయన విమర్శించారు.రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం ఉదయం 10 గంటలకు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసనలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కేసీఆర్‌పై సిట్ నోటీసులు జారీ చేయడాన్ని తెలంగాణ ఆత్మగౌరవంపై దాడిగా ప్రజలు భావిస్తున్నారని అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో నడిచిన నాయకుడిపై ఈ విధమైన చర్యలు సమంజసం కాదని, ప్రజలే దీనికి సరైన సమాధానం చెబుతారని బత్తిని అనిల్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఎక్కడికక్కడ రాస్తారోకోలు చేపట్టి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు.

# నిరుపేద మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు తోగరు చెన్నారెడ్డి

- 50 కేజీల (సన్నబియ్యం) ఆర్థిక సహాయం



**తొలి అక్షరం/చెన్నారావుపేట జనవరి 31:** వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలోని స్థానిక జల్లి గ్రామానికి చెందిన కాసాని రాజు,కుటుంబ ఆర్థిక కారణాల తో మనస్థాపానికి గురై మృతి చెందారు.ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ద్వారా తెలుసుకున్న పార్టీ నియోజక వర్గ నాయకులు తొగరు చెన్నారెడ్డి. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాను సారం మృతుడి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యాన్ని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ నూనె స్వామి, మంద శంకర్,ఆకుల మహేష్, వల్లాజి మహేందర్,పిల్లల వీరన్న,పులి చేరు నరేష్, నల్లగుంట్ల శ్రీను,కాసాని రమేష్ తదితరులు,కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మరో గ్రంథాలయ ఉద్యమం జరపాల్సిన ఆవశ్యకత నేటి సమాజానికి అవసరం




**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 31:** రిటైర్డ్ ఆంగ్ల ఉపాధ్యాయులు కస్తూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో రేపటి నుండి "హైదరాబాద్ " లో మొదలు కొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి వరకు నిర్వహిస్తున్న " మరో గ్రంధాలయ బస్సు యాత్ర " పోస్టర్ ఆవిష్కరణ జరుపుతూ శ్రీ హిందూ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పనకంటి భాస్కర్ రావు మాట్లాడుతూ నేటి సమాజం లో సెల్ ఫోన్, ఇంటర్నెట్ వల్ల మానవీయ విలువలు తగ్గి పోతు న్నాయని, ఇవాళ పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించే పుస్తక పఠనం తగ్గిపోయింది అని అన్నారు. మానవాళి లో ఆలోచన రేకెత్తించేది అక్షరం అయితే, ప్రపంచ గతిని మార్చేది పుస్తకం మాత్రమే అన్నారు. నేడు సమాజానికి మరిన్ని గ్రంధాలయాలను స్థాపించాల్సిన అవసరం ఉందని, రేపటి నుండి ప్రారంభం అయ్యే " మరో గ్రంధాలయ బస్సు యాత్ర " ను టీచర్స్,కవులు, రచయితలు, మేధావులు, తల్లిదండ్రులు, జర్నలిస్టులు దిగ్విజయం చేయాల్సిన అవసరం వుందన్నారు. రేపు పద్మశ్రీ కూరెళ్ల విఠలా చార్య గ్రంధాలయం వెళ్ళంకి కి వస్తున్న బస్సు యాత్ర ను అందరూ ఆహ్వానం పలకాలని కోరారు.. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం లోసాహితీ మిత్ర మండలి ప్రధాన కార్యదర్శి బాసరాజు యాదగిరి, వేముల సైదులు, లెక్చరర్స్ శ్రీదేవి, లింగస్వామి, వెన్నెల, కళ్యాణి, సునీల్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బూత్ అధ్యక్షుల ఎన్నిక



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 31:** రామన్నపేట బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి మునిపంపుల గ్రామానికి సంబంధించినటువంటి 3 బూతులు 46వ బూతు మామిళ్ళ నరేందర్ 47వ బూతు సద్దల వెంకన్న 48 రావుల నరేష్ ల కి గాను బూతు అధ్యక్షులని నియమించడం జరిగింది వీరు మాట్లాడుతూ రాబోయే రోజులలో మునిపంపుల గ్రామంలో బిజెపి జెండా ఎగరేయడమే లక్ష్యంగా గ్రామంలో బిజెపి బలోపేతానికి కృషి చేస్తూ ఎంపీటీసీ ఎన్నికలలో బీజేపీ గెలుపు కొరకై కృషి చేస్తూ గ్రామంలో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ బిజెపి చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలను భారతదేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి నీ ప్రజలకు వివరిస్తూ దేశ అభివృద్ధిలో మునిపంపుల గ్రామము కూడా ఆదర్శవంతంగా ఉండాలని యువతకి పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ నెంబర్ వనం అంజయ్య బిజెపి సీనియర్ నాయకులు డోగిపర్తి సుభాష్ కట్ట యాదయ్య మన్నెం పద్మా రెడ్డి జిల్లా యువ మోర్చా కార్యదర్శి అక్కెనపల్లి సైదులు నీల రాజేష్ ఏలూరి శ్యామ్ మేకల మల్లారెడ్డి సురువు జాంగిర్ మిరియాల శ్యాంసుందర్ మామిళ్ళ సుధీర్ చింత రమేష్ మిరియాల శ్రీధర్ పోగుల నవీన్ మామిళ్ల జలంధర్ ఆకుల వీరేష్ బోగిని రమేష్ దామరి నాగేష్ కొమ్మిరి ప్రశాంత్ పీట్ల రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# నూతన కిరాణం షాప్‌ని ప్రారంభించిన ఉమ్మడి చిన్న కోర్పోల్ గ్రామాల సర్పంచులు





**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 31:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలో చిన్నకోర్పోల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పులి మంగమ్మ -సాంబయ్య చిన్న కొర్పోల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న కిరాణా షాపునీ ప్రారంభించిన చెరువు ముందు తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ కున్సోత్ మంగమ్మ- శ్రీను నాయక్, చిన్నకోర్పోల్ గ్రామ సర్పంచ్ బానోతు అనిత- భద్రు నాయక్ లతో పాటు గ్రామ పెద్దలు గంగపురి చంద్రమౌళి గౌడ్, పులి రంజిత్, కర్ర రామయ్య, డాక్టర్ మోహన్, పాలిత్య శంకర్ బొల్లం యాకయ్య, జంపాల నాగయ్య, కొయ్యడ సాంబయ్య, ఆత్మకూరి నరసింహారాములు, వెం శెట్టి యాదగిరి, చింతల వెంకన్న, వెంకన్న,హచ్చు,గజ్జల సంతోష్ ,గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రిష్ణవేణీలో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం




**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 31:** మండల కేంద్రంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా వివిధ పాత్రలు పోషించి అందరిని ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు పాత్రలో తరగతి గదులలో తమ తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి, తమ ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ గా రింషా సదాఫ్, డిప్యూటీ కలెక్టర్ గా కె. గీతాంజలి, డి ఈ వో గా ఉమేమా బుస్రా, డిప్యూటీ డి ఈ వో గా అంతుల్ హాది, ఎండిఓ గా బి. ప్రతీక్ చారి, ఎమ్మార్ గా ఎన్. జస్వంత్, కరెస్పాండెంట్ గా ఎం. రిషిత, ప్రిన్సిపాల్ గా బి. చైత్ర తమ పాత్రలను పోషించారు. అనంతరం జరిగిన సమావేశంలో పాఠశాల కరెస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి. యాదగిరి, అకాడమిక్ డైరెక్టర్ జె వి ఎన్ ఎస్ మణి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు రషీద్, మురళి, శ్రీనివాస్,మల్లేష్, అలీం, సత్తయ్య, ఉమారాణి, మహాలక్ష్మి, పూనం దాస్, వినోద, లావణ్య, ఫారియా, విజయలక్ష్మి, కరుణ, కళ్యాణి, శ్వేతా, మమత, శ్రీలత, సంధ్య , మాధవి, ఎస్. ఉమారాణి, టి. లావణ్య, రేణుక, కవిత, అనూష, నజియా, సరిత,పాల్గొన్నారు

# ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా...

- కాంగ్రెస్ 11వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి డాక్టర్ సోమేశ్వరరావు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 31:** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ 11వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి డాక్టర్ పొనుగోటి సోమేశ్వరరావు అన్నారు. శనివారం 11వ వార్డులో డాక్టర్ సోమేశ్వరరావు-సరస్వతి దంపతులు ఇంటింట ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.తనను ఆదరించి గెలిపిస్తే పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల సహకారంతో వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. తొర్రూరు పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నానని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు తమ దంపతులు వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు.పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ల మద్దతుతో మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచామని,తనను ఆశీర్వదిస్తే వార్డు అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. వైద్యుడు,విద్యావేత్తగా,ఈ వార్డు ప్రజలకు సుపరిచితులమని,వార్డులోని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు,సంక్షేమ పథకాలు అందేలా, సిసి రోడ్లు,డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు వంటి సౌకర్యాలు సమకూరేలా కృషి చేస్తానని తెలిపారు. వార్డు ప్రజలు పెద్ద మనసుతో ఆలోచించి ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తొర్రూరు మాజీ సర్పంచ్ ధారావత్ రాజేష్ నాయక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందడి అశోక్ రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాటోత్ రవి నాయక్,గుడిబండ తండా సర్పంచ్ అభిరామ్,కాంగ్రెస్ నాయకులు చెవిటి సధాకర్,బజ్జాల అనిల్,ప్రభాకర్ రావు, కల్లూరి కుషాల్,సోమ్లా నాయక్, ప్రహ్లాద రావు,జాటోత్ సురేష్, రెడ్డబోయిన రవి, అశోక్, వెంకటయ్యా, కొలుపుల కుమార్, ఎల్లయ్య, సోమయ్యలు పాల్గొన్నారు.

# మేడారం సమ్మక్క- సారళమ్మ ను దర్శించుకున్న టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి

- నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్.



**తొలి అక్షరం/నెక్కొండ జనవరి 31:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో నుండి తెలంగాణ రాష్ట్ర మహా కుంభ మేళా గా పిలిచే మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతలకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్లను దర్శించుకొన్న నర్సంపేట నియోజకవర్గ టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు,జనగాం ప్రవీణ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్యా తిరుమల్, నర్సంపేట కోర్టు ఏ జి పి బండి శివ మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,వజ్రాల శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఒక్క అవకాశం ఇవ్వండి... ప్రజా ఆశీర్వాదంతో గెలిచి చూపిస్తా...

- సేవే లక్ష్యం ... కాంగ్రెస్ యువ నాయకుడు మంగా మధు ముదిరాజ్ ధీమా



**తొలి అక్షరం/షాద్ నగర్,జనవరి 31:** ప్రజల సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. ఒక్క అవకాశం ఇస్తే ప్రజల ఆశీర్వాదంతో 27 వ వార్డ్ కౌన్సిలర్‌గా గెలిచి చూపిస్తా అంటూ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు మంగా మధు ముదిరాజ్ పేర్కొన్నారు.షాద్‌నగర్ పురపాలక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు.ఈ సందర్భంగా మంగా మధు మాట్లాడుతూ...పార్టీ అవకాశం ఇస్తే తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకునే సమయం ఇదేనన్నారు. ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. పదవి లేకపోయినా ప్రజల మధ్య మమేకమై సేవా కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు.కాలనీల్లో తాగునీటి సమస్యలు, డ్రైనేజీ ఇబ్బందులు, రోడ్ల మరమ్మతులు, విద్యుత్ అంతరాయాలు వంటి అనేక సమస్యలను ఎమ్మెల్యే శంకర్ సహకారంతో పరిష్కరించామని గుర్తు చేశారు. ప్రజలే తన బలం, వారి ఆశీస్సులే తన నమ్మకమని పేర్కొన్నారు.యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు సంక్షేమ పథకాలు, వార్డ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతానని, గెలిస్తే ప్రతి ఇంటి సమస్యను తన బాధ్యతగా తీసుకుంటానని హామీ ఇచ్చారు.రాజకీయాలను సేవా మార్గంగా తీసుకుని ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానన్నారు.సుదీర్ఘ కాలంగా ఎమ్మెల్యే శంకర్ వెంటే ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నట్లు తెలిపారు.మంగా మధు చేపడుతున్న ప్రజా పర్యటనలకు స్థానిక యువత,పార్టీ కార్యకర్తలు మంచి స్పందన తెలుపుతున్నారు.ఆయనకు అవకాశం ఇస్తే పూర్తి మద్దతు అందిస్తామని స్థానికులు చెబుతున్నారు.

## మహాశివరాత్రి వేడుకలకు వెంకటగిరి కొండ శివాలయం సిద్ధం

**● సర్పంచ్ కోడిచెర్ల రాజేశ్వరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో...భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాట్లు**



**తొలి అక్షరం/షాద్ నగర్,జనవరి 31:** నందిగామ మండలం నర్సప్పగూడ లో రానున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వెంకటగిరి కొండ శివాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.గ్రామ సర్పంచ్ కోడిచెర్ల రాజేశ్వరి శ్రీనివాస్ నేతృత్వంలో ఆలయ ప్రాంగణం మరియు పరిసర ప్రాంతాల్లో భక్తుల సౌకర్యార్థం పలు చర్యలు తీసుకుం టున్నారు.ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు.రోడ్ల మరమ్మతులు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.మహాశివరాత్రి రోజు భారీ రద్దీ ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా క్యూలైన్‌లు, తాగునీటి సదుపాయాలు, శుభ్రత పనులు చేపడుతున్నారు. అలాగే విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించి, భక్తులు ప్రశాంతంగా పూజలు నిర్వహించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించ డమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సర్పంచ్ కోడిచెర్ల రాజేశ్వరి శ్రీనివాస్ పేర్కొన్నారు.గ్రామ ప్రజలు, యువత, వాలంటీర్లు ఈ ఏర్పాట్లలో పాల్గొని సహకారం అందిస్తున్నట్లు తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

**- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి వెల్లడి**



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 31:** రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రజావాణి కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు, పిర్యాదుదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

## పార్వతీ పరమేశ్వర పరివార దేవాలయంలో షష్ఠమ వార్షికోత్సవ మహోత్సవాలు



**తొలి అక్షరం/షాద్ నగర్ ,జనవరి 31:** ఉప్పరపల్లి జనచైతన్య రెసిడెన్సీ సమీపంలో ఉన్న శ్రీ శ్రీ పార్వతీ పరమేశ్వర పరివార దేవాలయంలో, శ్రీ విశ్వావసు సంవత్సర మాఘ శుక్ల చతుర్దశి సందర్భంగా, ది.31-01-2026 (శనివారము) నాడు దేవాలయ షష్ఠమ వార్షికోత్సవ మహోత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా ఉదయం 7:30 గంటలకు శ్రీ పార్వతీ పరమేశ్వర సహిత పరివార దేవతలకు విశిష్ట పంచామృత అభిషేక అలంకార పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10:00 గంటలకు రుద్ర హోమం, మధ్యాహ్నం 12:00 గంటలకు పూర్ణాహుతి నివేదన ఘనంగా జరిగింది.తదుపరి మధ్యాహ్నం 1:00 గంటలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ, అన్నప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించిన దాతలుఈ పవిత్ర కార్యక్రమంలో భాగంగా,వినాయకుడు, వీరభద్ర స్వామి, జంట నాగులు, స్వయంభూ శివుడుపార్వతి, పెద్దమ్మ తల్లి, అభయాంజనేయ స్వామి దేవాలయ సన్నిధిలో అన్నదానం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమానికితుంగ రాం రెడ్డి అరుణ, సత్యనారాయణ రెడ్డి , పద్మమ్మ, సుమన్ రెడ్డి ,సంతోష, శ్రీనివాస్ రెడ్డి , జయప్ర, ఇంద్రా రెడ్డి , సప్న, సికిందర్ రెడ్డి ,స్వరలత దంపతులు సహకరించారు.భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, శివపార్వతీ పరివార దేవతల దివ్య అనుగ్రహ ఆశీర్వచనాలు పొందారు.

# వెంకన్న గుడిలో శివయ్యకు 'గోస'.. ముప్పై ఏళ్లుగా వెలవెలబోతున్న జల సోమేశ్వరం!

**- ఏడుకొండలవాడి చెంత అనాథగా 'నరసింహులపేట' సోమేశ్వరుడు**

**- దీపం పెట్టే నాథుడు లేడు.. నైవేద్యం చూసే భాగ్యం లేదు**

**కొత్త చైర్మన్, ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ఈ అన్యాయాన్ని అరికడతారా?**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 31:** నరసింహులపేటఒకే ప్రాంగణం.. ఒకవైపు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవం, మరోవైపు అదే ప్రాంగణంలో ముప్పై ఏళ్లుగా నిరాదరణకు గురవుతున్న జల సోమేశ్వర స్వామి విషాదం. ఇది నరసింహులపేట మండల కేంద్రంలోని ప్రసిద్ధ ఆలయ పరిస్థితి. వెంకన్న సన్నిధిలో శివుడికి జరుగుతున్న ఈ అన్యాయంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, గత పాలకమండళ్ల ఉదాసీనత వల్ల పురాతనమైన శివాలయం నేడు అంధకారంలో మగ్గిపోతోంది.**అర్చకులు లేరు.. అభిషేకాల్లేవు!** గత మూడు దశాబ్దాలుగా ఈ జల సోమేశ్వర స్వామి ఆలయంలో కనీసం ధూపదీప నైవేద్యాలు కూడా సమర్పించే నాథుడు కరువయ్యారు. భక్తులు భక్తిశ్రద్ధలతో శివయ్యను దర్శించుకుందామని వెళ్తే, అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం, దుమ్ము, ధూళి చూసి కలత చెందుతున్నారు. పక్కనే ఉన్న వెంకన్న ఆలయం నిత్యం వేలమంది భక్తులతో, పూజలతో కళకళలాడుతుంటే.. అదే ప్రాంగణంలో ఉన్న శివాలయం మాత్రం ఎందుకింత నిరాదరణకు గురవుతోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.**పాలకమండళ్లు మారినా.. తలరాత మారునా?** ముప్పై ఏళ్ల కాలంలో పదుల సంఖ్యలో చైర్మన్లు మారారు, పాలకమండళ్లు కొలువుదీరాయి. కానీ, ఏ ఒక్కరూ ఈ శివాలయం పునరుద్ధరణ గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రస్తుతం బాధ్యతలు చేపట్టిన నూతన పాలకమండలి మరియు చైర్మన్ ఈ విషయంలోనైనా చొరవ చూపుతారా? లేదా పాత పద్ధతినే అవలంబిస్తారా? అని భక్తులు ఎదురుచూస్తున్నారు. **ఎమ్మెల్యేకి విన్నపం..** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ ఈ ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఈ ఆలయ అభివృద్ధికి జరిగిన ప్రయత్నాలు శూన్యం. కనీసం ఇప్పటికైనా ఎమ్మెల్యే గారు స్పందించి, ప్రత్యేక నిధులు కేటాయించి, శివాలయానికి పూర్వవైభవం తీసుకురావాలని వేడుకుంటున్నారు.**భక్తుల డిమాండ్లు ఇవే:** శివాలయానికి ప్రత్యేకంగా అర్చకుడిని నియమించాలి. నిత్యం ధూపదీప నైవేద్యాలు అందేలా చర్యలు తీసుకోవాలి.ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలి.శివుడికి మళ్లీ అభిషేకాలు జరగాలి.. ఓం నమఃశివాయ మంత్రంతో ఆ ప్రాంగణం మారుమోగాలి. కొత్త చైర్మన్ మరియు ఎమ్మెల్యే భక్తుల ఆవేదనను ఆలకించి, జల సోమేశ్వరుడికి మోక్షం కలిగిస్తారని ఆశిద్దాం.

# రఘునాధపాలెంలో దొంగల ముఠా హల్‌చల్

**పగలు రెక్కి... అర్ధరాత్రి దొంగతనాలు**

**పోలీస్ శాఖ వారు మండలంలో పెట్రోలింగ్ వ్యవస్థను పెంచాలి**

**గ్రామాల్లో గుర్తుతెలియని వ్యాపారం చేసుకునే వ్యక్తుల మీద అనుమానం..... గ్రామస్తులు**



**తొలి అక్షరం/ఖమ్మం జనవరి 31:** రఘునాథ పాలెంలో గత కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి బూడిదంపాడు గ్రామానికి చెందిన రైతు చేనులో ఉంచినటువంటి మిర్చి సుమారు 5 నుండి 10 క్వింటాల మిర్చి దొంగతనం జరిగింది కొద్దిరోజుల కాలంలోనే వాంకుడోత్ తండా గ్రామంలో అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఇంట్లో ఉన్నటువంటి బీరువాలను పగలగొట్టి బీరువాలో ఉన్నటువంటి నగలు డబ్బులను దొంగలించడం జరిగింది మరల బుడిదంపాడు గ్రామానికి సంబంధించి ట్రాన్స్ఫారాలను పగలగొట్టి అందులోనీ రాగి వైరును దొంగలించారు అంతరాష్ట్ర దొంగల జిల్లాకు సంబంధించిన దొంగల అనేది తెలియాల్సి ఉందిదొంగలు హల్ చల్ చేస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు ఈ మధ్యకాలంలో జిల్లా వ్యాప్తంగా దృష్టి మరల్చి దొంగతనాలు మోసాలకు పాల్పడుతున్న ముఠాలు హల్ చల్ చేస్తున్నాయి గ్రామాలలో గుర్తుతెలియని వ్యక్తులు బట్టల వ్యాపారస్తులుగా అనేక రకాల వ్యాపారాల పేరుతో గ్రామాల్లో చొరబడి పట్టపగలు రెక్కీ చేసుకొని అర్ధరాత్రి దోపిడీకి పాల్పడుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు ఖమ్మం పోలీసులు దొంగతనాలు చేసే ఈ దొంగల ముఠాలను సవాలుగా తీసుకొని నిందితులను అరెస్టు చేసి దొంగతనాలు జరగకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు పోలీస్ శాఖ వారిపై ప్రజలలో ఉన్న నమ్మకాన్ని పోగొట్టుకోకుండా దొంగతనాలు చేసే ముఠాలను పట్టుకొని పోలీస్ శాఖ వారు నమ్మకాన్ని కలిగించాలని గ్రామస్తులు తెలుపుతున్నారు ఈ ఘటనపై తీవ్రంగా గాలింపులు చేసి ఉన్నత అధికారులు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలో దించి ఇటువంటి దొంగతనాలు జరగకుండా రాత్రి సమయంలో పెట్రోలింగ్ వ్యవస్థను పెంచాలి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలియపరిచారురఘునాధపాలెం మండలం పోలీస్ శాఖ గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు

# రియల్' మాఫియా పంజా: నెల్లికుదురు చెరువు శిఖం భూములపై ప్రణాళికాబద్ధమైన 'దోపిడీ' కుట్ర!

**- లక్షల కష్టార్జితం నీటిపాలు కాకముందే మేల్కొనండి!**

**34 సర్వే నెంబర్ల భూములే టార్గెట్: రంగురంగుల ప్లాట్లతో అమాయక ప్రజలకు వల!**

**రికార్డుల్లో సర్కారు భూమి, క్షేత్రస్థాయిలో అక్రమ వెంచర్లు: అధికార యంత్రాంగం నిద్రమత్తులోనా?**

**బొల్లం ఎల్లయ్య రుద్రతాండవం: "ఇది పక్కా దోపిడీ! మోసపోతే రోడ్డున పడతారు!"**

**ప్రభుత్వ హెచ్చరిక: అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఖాయం!**

**మీరు కొనబోయేది ప్లాట్ కాదు.. మీ కన్నీళ్లను కొనుక్కున్నట్లే! ప్రజలకు అత్యవసర విజ్ఞప్తి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ, జనవరి 31:** నెల్లికుదురు మండల కేంద్రంలో భూ మాఫియా కోరలు చాచడమే కాదు, పదునైన పంజా విసిరి నిస్సిగ్గుగా దోపిడీకి పాల్పడుతోంది! కోట్ల విలువైన ప్రభుత్వ చెరువు శిఖం భూములను అక్రమంగా ఆక్రమించుకొని, వేల మంది అమాయక ప్రజల కష్టార్జితాన్ని కబళించేందుకు కుట్ర పన్నుతోంది. ముఖ్యంగా మహబూబాబాద్ తొర్రూర్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న 34వ సర్వే నెంబర్ భూములే ఈ భూబకాసురుల కబ్జా కాంక్షకు ప్రధాన కేంద్రంగా మారడం స్థానికంగా పెను కలకలం రేపుతోంది. ఇది కేవలం భూ ఆక్రమణ కాదు, ఒక ప్రణాళికాబద్ధమైన 'దోపిడీ' కుట్ర అని సామాజిక కార్యకర్తలు, ప్రజలు ముక్త కంఠంతో ఆరోపిస్తున్నారు. **పత్రాల్లో సర్కారు సొత్తు... క్షేత్రస్థాయిలో 'రియల్' మాఫియా రాజ్యం!** ప్రభుత్వ రికార్డులు పరిశీలిస్తే, 34 సర్వే నెంబర్‌లోని అపారమైన భూ విస్తీర్ణం పూర్తిగా ప్రభుత్వ చెరువు శిఖం పరిధిలోకి వస్తుంది. అంటే, ఈ భూమిపై ఒక్క ప్రైవేటు వ్యక్తికి కూడా అమ్మే హక్కు గానీ, కొనే హక్కు గానీ లేదు. ఇది పవిత్రమైన ప్రభుత్వ ఆస్తి. కానీ, ప్రధాన రహదారి పక్కన ఉండటంతో ఈ భూమికి ఉన్న అపారమైన వాణిజ్య విలువను సొమ్ము చేసుకునేందుకు కొందరు రియల్ ఎస్టేట్ ముసుగులోని దళారులు కంకణం కట్టుకున్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలను బరితెగించి ఉల్లంఘిస్తూ, రాత్రికి రాత్రే ప్లాట్లుగా విభజించి, రంగుల బోర్డులతో అమాయక ప్రజలను ఆకర్షించేందుకు దుస్సాహసానికి ఒడిగట్టారు. ఈ అక్రమ వెంచర్ల వెనుక అధికార, రాజకీయ అండదండలు ఉన్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. అధికార యంత్రాంగం నిద్రమత్తులో ఉందా లేక కళ్లు మూసుకుని ఉందా అని ప్రజలు నిలదీస్తున్నారు. **"పైసా పైసా పోగుచేసి కొంటే... చివరకు మిగిలేది శూన్యమే!" - బొల్లం ఎల్లయ్య నిప్పులు చెరిగారు!** ఈ అపహరణ వ్యవహారంపై సామాజిక కార్యకర్త, ప్రజా సేవా తత్పరుడు బొల్లం ఎల్లయ్య తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇవి పక్కాగా ప్రభుత్వానికి చెందిన చెరువు శిఖం భూములు! ఇందులో ఏమాత్రం మార్పు లేదు. దళారులు మాయమాటలు చెప్పి, లేని పత్రాలు సృష్టించి, మీ కష్టార్జితాన్ని దండుకోవాలని చూస్తున్నారు. ప్రజలారా! దయచేసి మోసపోవద్దు! ఎంతో కష్టపడి సంపాదించుకున్న మీ డబ్బును ఇలాంటి వివాదాస్పద, అక్రమ భూముల్లో పెట్టి నిండా మునగకండి. ఇది పక్కా దోపిడీ! ప్రభుత్వం ఎప్పుడైనా ఈ భూములను స్వాధీనం చేసుకుంటుంది. అప్పుడు ప్లాట్లు కొన్న అమాయకులు రోడ్డున పడటం, వారి కన్నీళ్లే మిగలడం ఖాయం. మీరు కొనబోయేది ప్లాట్ కాదు... మీ భవిష్యత్తును కొల్లగొట్టుకున్నట్లే," అని ఆయన నిప్పులు చెరిగారు. **అక్రమాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఖాయం: ప్రభుత్వ హెచ్చరిక!** ఈ అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొన్నవారికి భవిష్యత్తులో ఎటువంటి చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్లు జరగవని, ఒకవేళ దళారుల మాయాజాలంతో రిజిస్ట్రేషన్ చేయించినా అవి చట్టబద్ధం కావని ఎల్లయ్య పునరుద్ఘాటించారు. అంతేకాకుండా, ఇలాంటి ప్రభుత్వ భూములను ఆక్రమించినా, అక్రమ నిర్మాణాలకు పాల్పడినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని, అక్రమార్కులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు కూడా నమోదవుతాయని ఆయన హెచ్చరించారు. జిల్లా రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, ఈ అక్రమ దందాను అరికట్టాలని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. **అత్యవసర విజ్ఞప్తి మీ జీవితాన్ని కాపాడుకోండి!** గ్రామ రికార్డులను పరిశీలించండి: భూమి కొనే ముందు సంబంధిత మండల రెవెన్యూ కార్యాలయంలోని రికార్డులను స్వయంగా నిశితంగా పరిశీలించండి. గ్రామ నమూనా రిజిస్టర్ అడంగల్, 1-బీ వంటి పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయండి. **శిఖం భూమి ధృవీకరణ:** ముఖ్యంగా 34 సర్వే నెంబర్‌లోని భూములు చెరువు శిఖం భూములా? కాదా? అని త్రికరణ శుద్ధిగా ధృవీకరించుకున్న తర్వాతే ముందడుగు వేయండి. తహసీల్దార్ కార్యాలయం నుండి రాతపూర్వక ధృవీకరణ పొందండి. **ఆశ వద్దు, అప్రమత్తతే ముద్దు:** తక్కువ ధరకు వస్తుందని ఆశపడి, దళారుల మాయమాటల ఉచ్చులో చిక్కుకొని మీ జీవితాన్ని, మీ కష్టార్జితాన్ని నాశనం చేసుకోకండి. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రతి ఒక్క పౌరుడూ సహకరించాలని, అక్రమార్కుల ఆట కట్టించి, న్యాయ వ్యవస్థకు అప్పగించాలని ఈ సందర్భంగా ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు ప్రభుత్వానికి గట్టి విజ్ఞప్తి చేస్తున్నారు.



# కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 31:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని 1, 2 వార్డుల కాంగ్రెస్ అభ్యర్థులు తూనం శ్రావణ్ కుమార్,తాళ్లపెల్లి శ్రీలత రమేష్ గౌడ్ లను గెలిపించాలని కోరుతూ నిర్వహించిన రోడ్ షోలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ఇన్చార్జిలు టిపిసిసి ఉపాధ్యక్షులు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి లతో కలిసి మంత్రి మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం, రేషన్ కార్డులు అందించామని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు కట్టించి చూపించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించి పేదలకు అండగా నిలిచామని తెలిపారు.ప్రతి ఏప్రిల్ లో మరో విడతలో ఇండ్లు అందిస్తామన్నారు.రేవంత్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వంటి స్ట్రాంగ్ పిల్లర్ల వంటి నాయకులు ఏడుగురు ఉన్నారని,



ఒక్కొక్కరు కథానాయకులుగా మారి మునిసిపాలిటీలను గెలిపించుకుంటామన్నారు. తొర్రూరు అభివృద్ధికి 15 కోట్లు మంజూరయ్యాయని, మరో రూ. 25 కోట్లు మంజూరు చేస్తామన్నారు. గతంలో మునిసిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలిస్తే ఆ వార్డుల్లో ఒక్క రూపాయి గత ప్రభుత్వం విదిల్చలేదని తెలిపారు. తొర్రూరును దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని తెలిపారు. తన నియోజకవర్గంలో ఏదులాపురం ఏ విధంగా



అభివృద్ధి అయిందో అదే మాదిరి తొర్రూరును అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, సిపిఐ నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్,పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ముఖ్య నాయకులు, వివిధ వార్డుల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలు నామినేషన్ల పరిశీలన పూర్తి144 దరఖాస్తులు సక్రమం


• తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 31:** రాబోయే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించిన నామినేషన్ల పరిశీలన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం రిటర్నింగ్ అధికారుల సమక్షంలో అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల నుండి మొత్తం 144 నామినేషన్లు దాఖలయ్యాయని వెల్లడించారు.స్క్రుటినీ పరిశీలన అనంతరం ఈ 144 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఆయన ధృవీకరించారు. క్షుణ్ణంగా పరిశీలన: సాంకేతిక కారణాలు లేదా పత్రాల లోపం వంటి తప్పులేవీ లేకుండా అభ్యర్థులు జాగ్రత్త వహించడంతో ఎవరి నామినేషన్ కూడా తిరస్కరణకు గురికాలేదని కమిషనర్ తెలిపారు.తదుపరి అడుగు: ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉందని,ఆ తర్వాతే పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా విడుదల చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభ్యర్థులు మరియు రాజకీయ పార్టీలు నిబంధనలు ఉల్లంఘించకుండా సహకరించాలని ఈ సందర్భంగా కమిషనర్ శ్యాంసుందర్ కోరారు

## మున్సిపాలిటీని అన్ని విధములుగా అభివృద్ధి చేశా...

• మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 31:** టిఆర్ఎస్ హయాములోనే తొర్రూర్ మున్సిపల్ పట్టణం అన్ని విధములుగా అభివృద్ధి చెందిందని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు.శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మున్సిపల్ 5వ వార్డులోని హనుమాన్ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి ఐదో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మచ్చ సురేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 దొంగ హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసి ప్రభుత్వంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ఫెయిలయ్యారని తెలిపారు.గ్యాస్ సిలిండర్ కు సబ్సిడీ ఇస్తామని ఇవ్వకుండా మోసం చేశారన్నారు.ఎస్టీలను బాగు చేసింది కేసీఆర్ అని, గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిన ఘనత కూడా మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. మహిళలకు ఇస్తున్నటువంటి ఇందిరమ్మ చీరల పంపిణీలో కమిషన్ల కక్కుర్తితో మహిళా సంఘాల పేరుతో 450 కోట్ల రూపాయల రుణం అందులో పెద్ద కుంభకోణం జరిగిందన్నారు. రైతులకు రైతుబంధు, రైతుభరోసా పథకం ఇచ్చి రైతులకు అండగా నిలిచిన ఆపద్బాంధవుడు కేసీఆర్ అని ప్రజలకు తెలియజేశారు.ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ వాళ్ళు వస్తే ప్రభుత్వ దొంగ హామీలను నిలదీసి ప్రశ్నించాలని అన్నారు. మున్సిపల్ పట్టణంలోని 16 వార్డులను గెలిపించి మున్సిపల్ కైవసం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఐలయ్య, గాంధీ నాయక్ తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ నగర్ ఉన్నత పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ







**తొలి అక్షరం/షాద్ నగర్,జనవరి 31:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల్ సర్దార్ నగర్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో రంగా రెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగందే సురేష్ ఆధ్వర్యంలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ ఘనంగా నిర్వహించడం జరిగింది జిల్లా వ్యాప్తంగా 25 వేల నోట్ బుక్స్ గవర్నమెంట్ స్కూల్ లలో పంపిణీలో భాగంగా సర్దార్ నగర్ గ్రామంలో ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని, మేము కూడా గవర్నమెంట్ స్కూల్లో చదువుకొని ఈ విధంగా సామాజిక సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉన్నదని మరియు విద్యార్థులు కూడా గురువులు బోధించిన విద్యను క్రమశిక్షణతో మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉంటూ ఈ విధంగా సామాజిక సేవలో పాల్గొనాలని అన్నారు. సామాజిక కార్యకర్త నీల రవీందర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం చిన్నప్పుడు ఇంటింటికి తిరిగి పేపర్ వేస్తూ మరియు స్ట్రీట్ లైట్ కింద కూర్చొని కష్టపడి క్రమశిక్షణతో చదువుకొని భారత అనుశాస్త్రవేత్తగా రాష్ట్రపతి వరకు ఎదగడం క్రమ శిక్షణతో చదువుకోవడమేనని గుర్తు చేశారు ఫరూక్నగర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మరియు బుక్స్ కమిటీ చైర్మన్ ఎల్కుర్తి నారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గవర్నమెంట్ స్కూల్లో షాద్నగర్ ఆర్యవైశ్య వ్యాపారస్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో బుక్స్ కమిటీ కో చైర్మన్ ఫరుక్ నగర్ మండల మాజీ అధ్యక్షులు అనుమారీ మురళీధర్, బుక్స్ కమిటీకి ఆర్థికంగా సహకరించిన బూర్గు జగదీశ్వర్, సర్దార్ నగర్ గ్రామ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ ప్రాథమిక పాఠశాల మరియు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

• నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ సి.నారాయణ రెడ్డి




**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 31:** ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు.మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో షాద్‌నగర్ మున్సిపాలిటీకి సంబంధించిన నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ మయాంక్ మిట్టల్‌తో కలిసి శనివారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా నామినేషన్ల స్క్రూటినీ ఏ విధంగా నిర్వహిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో స్క్రూటినీ నిర్వహించాలని అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షాద్‌నగర్ మున్సిపాలిటీలో చేపట్టిన ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఎన్నికల ఫర్నిచర్, స్టేషనరీ తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డిని అడిగి తెలుసుకొని స్వయంగా తనిఖీ చేశారు. నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ హాల్‌ను కూడా పరిశీలించారు.ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అశ్రద్ధకు తావులేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే డిస్ట్రిబ్యూషన్ ఏర్పాట్లు, ఫిబ్రవరి 13న జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీఓ సరిత, ఫరూఖ్ నగర్ తహశీల్దార్ నాగయ్య, స్పెషల్ ఆఫీసర్ రామరావు, ఎస్. హరీష్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వైభవంగా మాఘ పౌర్ణమి వేడుకలు సాయినాథునికి 108 బిందెల పాలాభిషేకం





**తొలి అక్షరం/పులివెందుల జనవరి 31:** పులివెందుల పట్టణ పరిధిలోని పార్లపల్లి రోడ్డు,రిషి స్కూల్ సమీపంలో వెలసిన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయినాథునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సాయిబాబాకు 108 బిందెలతో అత్యంత వైభవంగా పాలాభిషేకం జరుగుతుందని ,లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో సామూహిక హోమాలు నిర్వహించనున్నారని ప్రతి ఏటా మాఘ మాసంలో ఈ వేడుకలను నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందని "భక్తులందరూ ఈ పవిత్రమైన అభిషేకాలు,హోమ పూజల్లో పాల్గొని సాయినాథుని కృపకు పాత్రులు కావాలని ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య పత్రికా ప్రకటన ద్వారా భక్తులకు ఆహ్వానం పలికారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## బి.టెక్ రవికి 'హరిత కానుక'తో సత్కారం

- కలిసిన ఏ.పీ.ఎస్.డి.పి.ఎస్ ఉద్యోగుల బృందం



**తొలి అక్షరం/పులివెందుల జనవరి 31:-**పులివెందుల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బి.టెక్ రవి ని శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏ.పీ.ఎస్.డి.పి.ఎస్ (ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ డేటా ప్రాసెసింగ్ సర్వీస్) ఉద్యోగుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది.ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయనకు హరిత కానుకను అందజేసి,శాలువా తో ఘనంగా సన్మానించారు.అనంతరం,తమ విధుల్లో ఎదుర్కొం టున్న పలు సమస్యలను మరియు విధులకు సంబంధించిన కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై సానుకూలంగా స్పందించిన బి.టెక్ రవి గారు,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## తిరుమల లడ్డు విషయంలో వైసీపీ ఆరోపణలు అర్థరహితం



**తొలి అక్షరం/వేంపల్లె జనవరి 31:** తిరుమల లడ్డు విషయం లో కల్తీ జరిగింది అని సుప్రీం కోర్ట్ ఏర్పాటు చేసిన సిట్ స్పష్టంగా పేర్కొన్న వైసీపీ లీడర్స్ముము ఖ్యమంత్రి చంద్రబాబు పై చంద్రబాబు ఫై అర్థ రహిత ఆరోపణలు చేయడం నీచమైన చర్య అని వైసీపీ నాయకుల ఆరోపణలు ఖండిస్తున్నట్లు కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పీవీయెస్ వి ప్రసాదరావు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. లడ్డు తయారీ లో పాలు లేకుండా తయారీ చేసిన కృతిమ నెయ్యి కెమికల్ పదార్థాలు తో తయారు చేసారని స్పష్టంగా పేర్కొన్నా సిగ్గు పడకుండా ఎదురు దాడి చేయడం దారుణం అన్నారు. కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి విషయం లో క్షమించారాని తప్పు చేసిన అప్పటిపాలక మండలి సభ్యులు సిగ్గు తో తలవంచు కోవాలన్నారు. చైర్మన్ పి ఏ. బ్యాంక్ అకౌంట్ లో కోట్ల రూపాయలు జమ అయినట్లు సిట్ స్పష్టంగా పేర్కొందీ అని అన్నారు. కెమికల్ తో తయారు చేసిన. నెయ్యి లో ఏమైనా ఉండ వచ్చువ ని. ల్యాబ్ నిపుణులు పేర్కొన్న దానిని పట్టించు కోక పోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి పార్టీ అధ్యక్షులు అయిన చంద్రబాబు ను అంబటి రాంబాబు బూతులు తో విమర్శించడం క్షమించరాని విషయం అని అంబటిపై కేసు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు.

# అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్త హత్య: భార్య, మేనల్లుడి అరెస్ట్



**తొలి అక్షరం/మాడుగులపల్లి/ జనవరి: 31:** మండలంలోని సీత్యాతండా గ్రామానికి చెందిన రమావత్ రవి తండ్రి లక్ష్మా, వయస్సు 34 సంవత్సరాలు హత్య కేసులో నిందితులైన అతని భార్య, మేనల్లుడిని మాడుగులపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు క్రైమ్ నెంబర్ 15/2026, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103(1) చదవబడిన 3(5) ప్రకారం మాడుగులపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయబడింది. మిర్యాలగూడ డీఎస్పీ కే.రాజశేఖర రాజు పర్యవేక్షణలో, మిర్యాలగూడ రూరల్ సీఐ పి.యన్.డి. ప్రసాద్, మాడుగులపల్లి ఎస్ఐ ఎస్.కృష్ణయ్య సిబ్బందితో కలిసి దర్యాప్తు నిర్వహించి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. 2026 జనవరి 27వ తేదీన మాడుగులపల్లి మండలం, సీత్యాతండా గ్రామంలో రమావత్ రవి తన నివాసంలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుల వివరాలు రమావత్ లక్ష్మి, భర్త మృతుడు రవి, వయస్సు 32 సంవత్సరాలు, కులం లంబాడ, వృత్తి గృహిణి, నివాసం సీత్యాతండా గ్రామం, మాడుగులపల్లి మండలం, మాలోతు గణేష్, తండ్రి శ్రీను, వయస్సు 21 సంవత్సరాలు, కులం లంబాడ, వృత్తి డ్రైవర్, నివాసం జెత్యాతండా గ్రామం, మిర్యాలగూడ మండలం, మృతుడి వివరాలు రమావత్ రవి, తండ్రి లక్ష్మా, వయస్సు 34 సంవత్సరాలు, కులం లంబాడ, వృత్తి అటెండర్, నివాసం సీత్యాతండా గ్రామం, మాడుగులపల్లి మండలం, నేరానికి కారణం మృతుడు రవి మద్యానికి బానిసై తరచూ తన భార్య లక్ష్మిని వేధించేవాడు. ఈ క్రమంలో లక్ష్మి తన మేనల్లుడు గణేష్‌తో అక్రమ సంబంధం పెట్టుకుంది. ఈ విషయం రవికి తెలిసి తరచూ గొడవలు జరుగుతుండగా, తమ అక్రమ సంబంధానికి రవి అడ్డుగా మారాడని భావించిన లక్ష్మి మరియు గణేష్ అతన్ని హతమార్చాలని నిర్ణయించుకున్నారు. రమావత్ రవి సుమారు 15 సంవత్సరాల క్రితం లక్ష్మిని వివాహం చేసుకోగా, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొద్ది రోజులుగా భార్య అక్రమ సంబంధం విషయమై రవి మద్యం సేవించి ఇంటికి వచ్చి తరచూ గొడవలు చేయడం పెరిగింది. ఈ నేపథ్యంలో 27.01.2026 తేదీ రాత్రి 1 గంటల నుంచి 2 గంటల మధ్యలో, రవి మద్యం సేవించి ఇంట్లో ఉన్న సమయంలో, లక్ష్మి మరియు గణేష్ కలిసి రోకలి బండతో రవి తలపై బలంగా కొట్టి, అనంతరం గొంతుపై కాలు వేసి తొక్కి హత్య చేశారు. అనంతరం గణేష్‌కు చెందిన మోటార్ సైకిల్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు హత్యకు ఉపయోగించిన ఆయుధం (రోకలి బండ) మూడు మొబైల్ ఫోన్లు ఒక పల్సర్ మోటార్ సైకిల్ ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి, వారి నుండి హత్యకు ఉపయోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

# నన్ను ఆశీర్వదించండి.. నాలుగో వార్డు సమస్యలను పరిష్కరిస్తా...





**నాయకులుగా కాదు... సేవకురాలిగా పనిచేస్తా నాలుగవ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బోయిన కుమారి**

**నేడు ప్రచారంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**తొలి అక్షరం/ఖమ్మం, జనవరి 31 :** ఖమ్మం జిల్లా ఏదులపురం మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల్లో నాలుగో వార్డు నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బోయిన కుమారి ప్రజల ఆశీర్వాదం, మద్దతు కోరారు. శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు మాట్లాడుతూ, నాలుగో వార్డులో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.నాయకులుగా అధికారాన్ని అనుభవించేందుకు కాకుండా, సేవకునిగా ప్రజల మధ్య ఉంటూ పనిచేయాలనే సంకల్పంతోనే తాను ఎన్నికల బరిలో నిలిచానని బోయిన కుమారి అన్నారు. తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలు, రహదారుల దుస్థితి, పారిశుద్ధ్య లోపాలు, వీధి దీపాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రణాళికాబద్ధంగా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.నాలుగో వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకం ఉంచిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చూస్తానని చెప్పారు.ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరంతరంగా పోరాటం చేస్తానని ఆయన తెలిపారు. వార్డులోని యువత, మహిళలు, వృద్ధుల సమస్యలపై ప్రత్యేకంగా స్పందిస్తానని, ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా నిలుస్తానని స్పష్టం చేశారు.ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని నాలుగవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పట్టణాభివృద్ధి వేగవంతమవుతుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతుందని మంత్రి పేర్కొన్నారు. భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.నాలుగో వార్డు ప్రజల నమ్మకమే తనకు అతి పెద్ద బలమని బోయిన కుమారి పేర్కొంటూ, తమ ఆశీర్వాదంతో గెలిపిస్తే వార్డు అభివృద్ధికి పూర్తిగా అంకితమై పనిచేస్తానని ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు, మహిళాలు, యువ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మేడారం జాతరలో రద్దీ తట్టుకోలేక తోపులాట

**'100 కొట్టు బెల్లం పట్టు' వద్ద ప్రమాదం! హనుమకొండ భక్తురాలికి 5 కుట్లు**

**మేడారం రూట్‌లో 8 కిలోమీటర్ల భారీ ట్రాఫిక్ జామ్‌డ జాతర 4వ రోజు భక్తుల వెల్లువ**





**తొలి అక్షరం/ములుగు జిల్లా, జనవరి 31:** తాడ్వాయి మేడారం:ప్రపంచ ప్రఖ్యాత మేడారం సమ్మక్కసారలమ్మ జాతర నాలుగో రోజు సందర్భంగా భక్తుల రద్దీ ఊహించని స్థాయిలో పెరిగింది. జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మేడారం పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి.భక్తుల రద్దీని చూసిన స్థానికులు "ఇలాంటి జాతర ఎప్పుడూ చూడలేదు" అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.'100 కొట్టు బెల్లం పట్టు' వద్ద తోపులాటడ భక్తురాలికి గాయాలుజాతరలో కీలకమైన తాడ్వాయి మండలం పరిధిలోని '100 కొట్టు బెల్లం పట్టు' ప్రాంతంలో భక్తులు ఒక్కసారిగా గుమిగూడటంతో తీవ్ర తోపులాట జరిగింది. దర్శనం కోసం ముందుకు దూసుకెళ్లిన భక్తుల గుంపు అదుపుతప్పడంతో పరిస్థితి క్షణాల్లో ఉద్రిక్తంగా మారింది.ఈ తోపులాటలో హనుమకొండ నుంచి వచ్చిన ఓ భక్తురాలు ప్రమాదానికి గురయ్యారు. ఆమె సన్నిధానంలో సమ్మక్కకు సమర్పించేందుకు తీసుకొచ్చిన బెల్లం ముద్ద తలపై పడటంతో తీవ్ర గాయమైందని సమాచారం.తలకు గాయండ 5 కుట్లుడ ఆసుపత్రికి తరలింపుప్రమాదంలో గాయపడిన భక్తురాలికి తలపై తీవ్ర గాయం కావడంతో 5 కుట్లు వేసినట్లు తెలిసింది. వెంటనే అక్కడున్న భక్తులు, సిబ్బంది స్పందించి ఆమెను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.మేడారం రూట్‌లో 8 కిలోమీటర్ల ట్రాఫిక్ జామ్‌భక్తుల రద్దీ ప్రభావం రహదారులపై కూడా తీవ్రంగా కనిపిస్తోంది.తాడ్వాయి నుంచి మేడారం వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు కదలకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, వీఐపీ కార్లు వరుసగా నిలబడిపోయి రోడ్డు పూర్తిగా బ్లాక్ అయింది. భక్తులు గంటల తరబడి రోడ్డుపైనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# ఆటపాటలతో తెలంగాణ రగిలించిన గద్దర్‌కు ప్రజల ఘనస్మరణ

**• షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘన నివాళ • ప్రజాయుద్ధ నౌక గద్దర్‌కు నివాళి అర్పించిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నేతలు, తెలంగాణ ఉద్యమకారులు, జేఏసీ నేతలు,**





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 31:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన సాహిత్యం ద్వారా యావత్తు తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసి'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన గొప్ప నేత గద్దర్ అని షాద్ నగర్ ఎమ్మెల్యే విర్ల పల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ లో ఎంపీడీవో కార్యాలయం అవరణ లో తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణం వద్ద ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే విర్ల పల్లి శంకర్ హాజరై గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆట పాటలతో ప్రజలను చైతన్యం చేసి తుది శ్వాస వరకు అణగారిన వర్గాల కోసమే పాటుపడి, తన పాటతో జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప ప్రజా గాయకుడు విప్లవ కవి,ప్రజాయుద్ధ నౌక గద్దర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత తాండ్ర కాశీనాథ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,తెలంగాణ ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు,మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్ రాంరెడ్డి,షాద్ నగర్ టిజేఏసీ నేతలు జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరక్టర్ త్రిప్పిశెట్టి కర్ణకర్,కాంగ్రెస్ నేతలు ఇబ్రహీం, జగదీష్ అప్ప,జాంగారి రవి,మేకల వెంకటేష్, మాజీ సర్పంచులు బాధేపల్లి సిద్దార్థ, ఆశన్న గౌడ్, సోలిపుర్ శ్రీశైలం గౌడ్ ,నర్సప్ప గూడ కృష్ణ ,మాజీ ఎంపీటీసీ తుపాకుల శేఖర్, ఉప సర్పంచ్ లింగారెడ్డి గూడ అశోక్, మాజీ ఉపసర్పంచ్ సీతారాం, సింగారం దర్శన్, జెట్ట మహేందర్, అజ్మత్ బాబా,ఉద్యమ కారుల వెల్ఫేర్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ నేతలు అర్జున్ కుమార్, బిష్వ కృష్ణయ్య, టెలిఫోన్ వెంకటయ్య, నేతలు చించేడ్ శ్రీధర్, దాసరి శివ,కోడూరు రాములు, కావాలి బాల నర్సింహులు, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యర్థులవి 'మాటలు'.. మావి చేతల పనులు..!





**• పదేళ్ల దొరల పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం • కమిషన్ల కక్కుర్తితో కట్టిన కాళేశ్వరం ఏమైందో చూడండి • ఏదులాపురం ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ పై మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు**

**తొలి అక్షరం/ఏదులాపురం జనవరి 31 :** "ఎన్నికలు రాగానే ప్రత్యర్థులు మీ ముందుకు వచ్చి 'మాటలు' చెబుతారు. మాయమాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తారు. కానీ, పదేళ్లు అధికారంలో ఉండి పేదవాడికి ఒక ఇల్లు కూడా ఇవ్వని వారు ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతారు?" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. శనివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3, 4, 5, 6, 25వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల శంఖారావం పూరించారు.**గత పాలకులు చేసింది అకౌంట్లు నింపుకోవడమే...** ప్రచార సభల్లో మంత్రి పొంగులేటి పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత దొరల పాలనలో పేదలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆనాటి పాలకులు తమ అకౌంట్లు నింపుకోవాలని చూశారే తప్ప, సామాన్యుల సంక్షేమాన్ని గాలికొదిలేశారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని కుమ్మరించి, కేవలం కమిషన్ల కోసం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నేడు కళ్లముందే కూలిపోతోంది. ఇది వారి అవినీతికి నిదర్శనం కాదా?" అని ప్రశ్నించారు. రెండు సార్లు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించిన చరిత్ర వారిదని ఎద్దేవా చేశారు.**చేతల ప్రభుత్వం.. ఇందిరమ్మ రాజ్యం** తాము అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే మాటను నిలబెట్టుకున్నామని మంత్రి స్పష్టం చేశారు. "మేము మాటలు చెప్పేవాళ్లం కాదు.. పనిచేసే వాళ్లం. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాం. అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలంతో పాటు రూ. 5 లక్షల సాయం అందిస్తాం" అని భరోసా ఇచ్చారు. ఉచిత బస్సు ప్రయాణం, 500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయని, ఇవే తమ ప్రభుత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు.**ఏదులాపురానికి కొత్త హంగులు** ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని మంత్రి పునరుద్ఘాటించారు. "వచ్చే వర్షాకాలం నాటికి మున్నేరు రక్షణ గోడను పూర్తి చేసి ప్రజల కష్టాలు తీరుస్తాం. ఎఫ్.సి.ఐ గోడౌన్ తరలింపుతో పాటు ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తాం. మీ కష్టం తెలిసిన మీ పెద్ద కొడుకుగా నేను మీకు అండగా ఉంటా" అని హామీ ఇచ్చారు. విపక్షాల సొల్లు కబుర్లను నమ్మకుండా, అభివృద్ధిని కాంక్షిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.



# టీ20 వరల్డ్ కప్ ప్రోమోలో పాకిస్థాన్‌ను ఒక రేంజ్‌లో ఆడుకున్న ఇండియా

క్రికెట్ ప్రపంచంలో ఇండియా-పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. గ్రౌండ్‌లో బాల్ పడకముందే సోషల్ మీడియాలో యుద్ధం మొదలైపోతుంది. ఇక మ్యాచ్ దగ్గరపడుతోందంటే చాలు.. ఇరు దేశాల ఫ్యాన్స్ మధ్య మాటల తూటాలు పేలుతుంటాయి. తాజాగా ఫిబ్రవరి 15న జరగబోయే హై-వోల్టేజ్ మ్యాచ్ కోసం స్టార్ స్పోర్ట్స్ వదిలిన ఒక వీడియో ఇప్పుడు నెట్టింట మంట పుట్టిస్తోంది. ఈ మధ్యకాలంలో యాడ్స్, ప్రోమోలతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కాస్త ఓవర్ యాక్షన్ చేస్తోంది. ఆస్ట్రేలియాతో సిరీస్ టైమ్‌లో పాత గొడవలను గుర్తుచేస్తూ వాళ్లు వదిలిన వీడియోకి గట్టి కౌంటర్ పడింది. స్టార్ స్పోర్ట్స్ రిలీజ్ చేసిన లేటెస్ట్ టీ20 వరల్డ్ కప్ ప్రోమోలో మన యూట్యూబర్ అభిషేక్ మల్హాన్ (ఫుక్రా ఇన్సాన్) పాకిస్థాన్ ఫ్యాన్‌ని ఓ రేంజ్‌లో ట్రోల్ చేశాడు. మన జెర్సీలు వేసుకున్న ఫ్యాన్స్‌తో కలిసి అభిషేక్ వేసిన సెటైర్లు మామూలుగా లేవు. "ఇండియా మీద గెలవడం మీవల్ల కాదులే" అనేలా ఉన్న ఈ వీడియో.. సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పాకిస్థాన్ పాత "మౌకా" యాడ్స్‌కి ఇది పర్ఫెక్ట్ రివెంజ్ అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రోమోలో అంత కాన్ఫిడెన్స్ కనిపించడానికి కారణం లేకపోలేదు. రీసెంట్ రికార్డులు చూస్తే పాకిస్థాన్ పరిస్థితి దారుణంగా ఉంది. మొన్న జరిగిన ఆసియా కప్‌లో ఇండియా ఏకంగా మూడుసార్లు (గ్రూప్ స్టేజ్, సూపర్



4, ఫైనల్ రౌండ్స్ కలుపుకొని) పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించింది. గత 15 ఏళ్ల రికార్డ్స్ తీస్తే.. రెండు జట్ల మధ్య జరిగిన 32 మ్యాచ్‌ల్లో ఇండియా ఏకంగా 24 సార్లు గెలిచింది. ఎప్పుడో అరుదుగా, పొరపాటున పాకిస్థాన్ గెలిస్తే అది 'అప్సెట్' కింద లెక్కే తప్ప, వాళ్ల డామినేషన్ ఎక్కడా కనిపించడం లేదు. ఆసియా కప్ గెలిచాక జరిగిన డ్రామా అంతా ఇంతా కాదు. పొలిటికల్ కారణాల వల్ల ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధికారుల చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోవడానికి భారత క్రికెటర్లు ఇష్టపడలేదు. అందులో పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ చైర్మన్ మొహ్సిన్ నక్వీ కూడా ఉండటంతో, డిప్లొమాటిక్ టెన్షన్స్ గ్రౌండ్‌లో కూడా క్లియర్‌గా కనిపించాయి. ఈ గొడవలన్నీ ఫిబ్రవరి 15న జరగబోయే మ్యాచ్‌ను మరింత సీరియస్‌గా మార్చేశాయి. వచ్చే నెల 15న జరగబోయే ఈ బిగ్ ఫైట్‌కి శ్రీలంకలోని కొలంబో వేదిక కానుంది.

# పాకిస్థాన్‌పై వైభవ్ బదులు తీర్చుకుంటాడా..?



అండర్-19 వరల్డ్ కప్ 2026లో అసలైన సమరానికి సమయం ఆసన్నమైంది. ఫిబ్రవరి 1వ తేదీన క్రికెట్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే భారత్ వర్సెస్ పాకిస్థాన్ మహా సంగ్రామం జరగనుంది. ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌లో అందరి కళ్లు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే ఉన్నాయి. ఐపీఎల్ వేలంలో రికార్డు ధర పలికి వార్తల్లో నిలిచిన వైభవ్, ఈ మ్యాచ్‌లో చెలరేగితే భారత్‌కు విజయం నల్లేరుపై నడకే. అయితే పాకిస్థాన్‌పై వైభవ్‌కు ఉన్న గత రికార్డులు మాత్రం అంత ఆశాజనకంగాలేవు. ఈ నేపథ్యంలో పాత లెక్కలు సరిచేయడానికి వైభవ్ సిద్ధమవుతున్నాడు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు పాకిస్థాన్‌పై మూడు అండర్-19 వన్డేలు ఆడాడు. అయితే ఈ మూడు మ్యాచ్‌ల్లో కలిపి అతను చేసిన పరుగులు కేవలం 32 మాత్రమే. సగటు కేవలం 10.66గా ఉంది. గత ఏడాది జరిగిన అండర్-19 ఆసియా కప్ ఫైనల్లో భారత్ ఓడిపోయినప్పుడు, వైభవ్ చేసిన 26 పరుగులే పాకిస్థాన్‌పై అతని అత్యధిక స్కోరు. అంటే, ఒక స్టార్ బ్యాటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న వైభవ్‌కు పాక్ ఒక పెద్ద సవాలుగా మారింది. ఈసారి వరల్డ్ కప్ వేదికగా తనపై ఉన్న విమర్శలకు సమాధానం చెప్పడమే కాకుండా, తన వ్యక్తిగత రికార్డును మెరుగుపరుచుకునేందుకు ఇది గొప్ప అవకాశం. పాకిస్థాన్‌ను ఓడించడం కేవలం ప్రతిష్టాత్మకమే కాదు, టెక్నికల్‌గా కూడా భారత్‌కు చాలా ముఖ్యం. రేపటి మ్యాచ్‌లో భారత్ గెలిస్తే, పాకిస్థాన్ టోర్నీ నుంచి దాదాపు నిష్క్రమించినట్టే. ఈ మ్యాచ్ గురించి వైభవ్ సహచర ఆటగాళ్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కెప్టెన్ ఆయుష్ మ్హాత్రే, విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుండు, దీపేష్ దేవేంద్రన్, హేనిల్ పటేల్ ఈ మ్యాచ్‌ను ఒక సాధారణ ఆటగా పరిగణిస్తూనే, తమ అత్యుత్తమ ప్రదర్శన ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఒత్తిడికి లోనుకాకుండా సహజ సిద్ధమైన ఆట ఆడటమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. అండర్-19 వరల్డ్ కప్ చరిత్రను తిరగేస్తే భారత్, పాకిస్థాన్ జట్లు ఇప్పటివరకు 10 సార్లు తలపడ్డాయి. విశేషమేమిటంటే..రెండు జట్లు తలో 5 మ్యాచ్‌లు గెలిచి సమానంగా ఉన్నాయి. ఈ రికార్డును బట్టి చూస్తే రేపటి మ్యాచ్ ఎంత హోరాహోరీగా సాగనుందో అర్థం చేసుకోవచ్చు. భారత్ తన ఆరో విజయం కోసం చూస్తుంటే, పాక్ తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని తహతహలాడుతోంది. వైభవ్ సూర్యవంశీ క్రీజులో నిలబడితే పాక్ బౌలర్లకు కష్టాలు తప్పవు.

# 17 ఏళ్ల తర్వాత రోహిత్ సారథ్యంలో మళ్లీ చరిత్ర సృష్టించిన భారత్



క్రికెట్ ప్రపంచంలో టీ20 ఫార్మాట్‌కు ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తక్కువ టైమ్‌లో ఎక్కువ ఎంటర్టైన్మెంట్ ఇచ్చే ఈ మెగా టోర్నీలో టీమిండియా ప్రస్థానం చాలా డిఫరెంట్ గా సాగింది. కొన్నిసార్లు ఆకాశమంత ఎత్తులో ఉంటే.. ఇంకొన్ని సార్లు ఊహించని ఓటములతో కిందకు పడిపోయింది. పరుగుల వరద పారించినా.. వికెట్లు కూల్చినా మనోళ్ల తర్వాతే ఎవరైనా అనిపించినా ఐసీసీ మొదటి టీ20 ట్రోఫీ గెలిచిన తరువాత మాత్రం మళ్ళీ చాలా టైమ్ పట్టింది. 2007లో ధోనీ సేన సృష్టించిన వండర్ నుంచి 2024లో రోహిత్ శర్మ కళ్లలో నీళ్లు తెప్పించిన విక్టరీ వరకు అసలు టీమ్ఇండియా ప్రయాణం ఎలా సాగింది 2007లో సౌత్ ఆఫ్రికా వేదికగా జరిగిన మొదటి టీ20 వరల్డ్ కప్ ఒక మర్చిపోలేని జ్ఞాపకం. సచిన్, రాహుల్, గంగూలీ శకం ముగింపు తరువాత సీనియర్ ఆటగాళ్లు లేకుండా, ఎంఎస్ ధోనీ సారథ్యంలో యువ జట్టు బరిలోకి దిగింది. అంచనాలు ఏమాత్రం లేని స్థితి నుంచి అద్భుత ప్రదర్శనతో ఫైనల్ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగిన ఆ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠకు పరాకాష్ట. చివరి ఓవర్‌లో శ్రీశాంత్ పట్టిన ఆ క్యాచ్ భారత్‌ను మొదటిసారి టీ20 విశ్వవిజేతగా నిలబెట్టింది. ఈ విజయమే భారత్‌లో ఐపీఎల్ వంటి భారీ లీగ్ రావడానికి, టీ20 ఫార్మాట్ ప్రాచుర్యం పొందడానికి పునాది వేసింది. మొదటి టీ20 వరల్డ్ కప్ విజయం తరువాత టీమ్ఇండియాకు పెద్దగా కలిసి రాలేదు. వరుసగా సీనియర్లు ఫామ్ కోల్పోవడం కూడా జరిగింది. 2009లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన టీమ్ఇండియా, సెమీస్ చేరడంలో విఫలమైంది. అలాగే 2010లో వెస్ట్ ఇండీస్‌లో జరిగిన టోర్నీలో కూడా రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. ఈ రెండు టోర్నీల్లోనూ అంచనాలు భారీగా ఉన్నా, ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదు. 2012లో శ్రీలంక వేదికగా జరిగిన టోర్నీలో భారత్ సెమీఫైనల్ చేరుతుందనుకున్నా, కేవలం కొద్ది తేడాతో ఆ అవకాశాన్ని మిస్ చేసుకుంది. ఇక 2014లో భారత్ తన ప్రతాపం చూపించింది. అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ వరకు దూసుకెళ్లింది. కానీ టైటిల్ పోరులో శ్రీలంక చేతిలో ఆరు వికెట్ల తేడాతో ఓటమి పాలై రన్నరప్‌గా మిగిలిపోయింది. ఈ ఓటమి అప్పట్లో టీమ్ఇండియా ఫ్యాన్స్‌ను చాలా బాధించింది. అప్పటికే వన్డే వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్, ఈ కప్పు కూడా గెలుస్తుందని అందరూ ఆశించారు. కానీ అనుకున్నట్లు జరగలేదు. 2016లో ఆతిథ్యమిచ్చిన భారత్ వరల్డ్ కప్‌లో ఫేవరెట్ జట్టుగా బరిలోకి దిగింది. అయితే సెమీఫైనల్‌లో వెస్ట్ ఇండీస్ మన కలలను చిదిమేసింది. ముంబైలో జరిగిన ఆ పోరులో విండీస్ ఏడు వికెట్ల తేడాతో గెలిచి భారత్‌ను టోర్నీ నుంచి పంపించేసింది. ఆ తర్వాత కరోనా వల్ల విరామం రావడంతో 2021లో దుబాయ్‌లో టోర్నీ జరిగింది. ఈ ఎడిషన్ భారత్‌కు ఒక పీడకల లాంటిది.

# గాయంతోనే జ్వెరెవ్‌ను చిత్తు చేసిన అల్కరాజ్!



మెల్ బోర్న్ వేదికగా జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ 2026లో టెన్నిస్ ప్రపంచం ఓ అద్భుతమైన పోరాటాన్ని వీక్షించింది. టెన్నిస్ ఫ్యాన్స్ దశాబ్దాల పాటు గుర్తుంచుకునే అద్భుత ఘట్టం రోడ్ లేవర్ ఎరీనాలో ఆవిష్కృతమైంది. స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్, జర్మనీ దిగ్గజం అలెగ్జాండర్ జ్వెరెవ్‌ల మధ్య 5 గంటల పాటు సాగిన మెగా వార్‌లో అల్కరాజ్ విజేతగా నిలిచాడు. తొడ, నడుము గాయంతో విలవిల్లాడుతున్నా ఏ మాత్రం పట్టువదలకుండా పోరాడి తన కెరీర్లో మొదటిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్నాడు.మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగుతున్న సమయంలో కార్లోస్ అల్కరాజ్ తీవ్రమైన నొప్పితో కోర్టులోనే కుప్పకూలాడు. ఆయనకు మెడికల్ టైమ్-అవుట్ ఇవ్వడంపై జ్వెరెవ్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. కండరాలు పట్టివేస్తే టైమ్-అవుట్ ఇవ్వకూడదనే నిబంధనను ఆయన గుర్తు చేశాడు. అయితే అల్కరాజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఆట కాసేపు నిలిచిపోయింది.తొలి రెండు సెట్లను 6-4, 7-6(5)తో గెలుచుకున్న అల్కరాజ్‌కు, గాయం తర్వాత జ్వెరెవ్ గట్టి పోటీ ఇచ్చాడు. తర్వాతి రెండు సెట్లను టై-బ్రేకర్లలో గెలిచిన జ్వెరెవ్ మ్యాచ్‌ను నిర్ణయాత్మక ఐదో సెట్‌కు తీసుకెళ్లాడు. ఐదో సెట్‌లోనూ జ్వెరెవ్ 3-1తో ముందంజలో ఉన్నప్పుడు అల్కరాజ్ కథ ముగిసిందని అందరూ భావించారు. కానీ కాలికి బ్యాండేజీతోనే సింహంలా పోరాడిన అల్కరాజ్.. వరుస గేమ్ పాయింట్లతో 7-5తో చివరి సెట్‌ను కైవసం చేసుకుని మ్యాచ్‌ను ముగించాడు.వచ్చే ఆదివారం జరగబోయే ఫైనల్‌లో అల్కరాజ్ విజయం సాధిస్తే, టెన్నిస్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో 'కెరీర్ గ్రాండ్ స్లామ్' (నాలుగు ప్రధాన టైటిల్స్ గెలవడం) పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. ఓపెన్ ఎరాలో ఈ ఘనత సాధించిన ఎనిమిదో ఆటగాడిగా ఆయన నిలుస్తారు. ఫైనల్‌లో అల్కరాజ్, నొవాక్ జకోవిచ్ లేదా యానిక్ సినర్‌తో తలపడనున్నారు. ఆదివారం మెల్‌బోర్న్ పార్క్ ఓ సరికొత్త చరిత్రకు సాక్షిగా నిలవబోతోంది.

# ఆస్ట్రేలియా ఓపెన్ 2026 విజేతగా ఎలైనా రైబకినా

తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను ముద్దాడిన రైబకినా ప్రతిష్టాత్మక టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ విజేతగా కజకిస్థాన్ స్టార్ ఎలైనా రైబకినా నిలిచింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అరీనా సబలెంకా 4-6, 6-4, 4-6 తేడాతో ఐదో సీడ్ ఎలైనా రైబకినా చేతిలో ఓటమిపాలైంది. అద్వితీయమైన ప్రదర్శనతో వరల్డ్ నెంబర్ వన్ సబలెంకాకు షాకిచ్చిన ఎలైనా రైబకినా కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను ముద్దాడింది. ఓవరాల్‌గా ఎలైనా రైబకినాకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్. అంతకుముందు వింబుల్డన్ 2022 టైటిల్ గెలిచింది. తాజా విజయంతో ఆస్ట్రేలియా ఓపెన్ 2023 ఫైనల్లో సబలెంకా చేతిలో ఎదరైనా పరాజయానికి రైబకినా ప్రతీకారం తీర్చుకుంది.ఆస్ట్రేలియా ఓపెనర్ 2026 విజేతగా నిలిచిన ఎలైనా రైబకినాకు రూ.25 కోట్ల 25 లక్షల రూపాయల ప్రైజ్‌మనీ లభించింది. ఈ గెలుపుతో రైబకినా తన కెరీర్ బెస్ట్ ర్యాంకింగ్ నెంబర్



3కి చేరుకోనుంది. సుమారు 2 గంటల 18 నిమిషాల పాటు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో ఎలెనా రైబకినా పై చేయి సాధించింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లో ఒక దశలో రైబకినా 0-3తో వెనుకంజలో నిలిచింది. దాంతో సబలెంకా విజయం ఖాయమని అంతా అనుకున్నారు. కానీ రైబకినా నేలకు కొట్టిన బంతిలా పుంజుకొని వరుస గేమ్‌లు గెలిచి సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.తొలి సెట్‌లో ఆధిపత్యం చెలాయించిన రైబకినా 37 నిమిషాల్లోనే 6-4తో గెలిచింది. రెండో సెట్‌లో సబలెంకా పుంజుకోవడంతో పోరు హోరాహోరీగా మారింది. 55 నిమిషాల పోరాటం తర్వాత 6-4తో సబలెంకా రెండో సెట్ కైవసం చేసుకుంది. దాంతో నిర్ణయాత్మక మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. అత్యంత ఉత్కంఠగా సాగిన ఈ సెట్‌లో రైబకినా వెనుకంజలో నిలిచినా.. పట్టు విడవకుండా పోరాడి 46 నిమిషాల్లో సెట్‌ను కైవసం చేసుకోవడంతో పాటు తొలి టైటిల్‌ను ముద్దాడింది. ఈ ఓటమిని తట్టుకోలేకపోయిన సబలెంకా తన సీట్లో కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చింది. మూడో సెట్‌లో 3-0తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ మ్యాచ్ చేజారడాన్ని ఆమె తట్టుకోలేకపోయింది. ఇప్పటి వరకు నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచిన సబలెంకా.. మరో నాలుగు ఫైనల్లో ఓటమిపాలైంది. ఈ సీజన్‌లో ఒక సెట్ కూడా కోల్పోకుండా విజయాల పరంపర కొనసాగించిన సబలెంకాకు రైబకినా బ్రేక్ వేసింది. 2001, 2002 ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఛాంపియన్ అయిన జెన్నిఫర్ కాప్రియాటి చేతుల మీదుగా రైబకినా టైటిల్ అందుకుంది.



# ల్యాండ్ మార్క్ మూవీ..

## టాలీవుడ్ కింగ్ 'టార్గెట్' అదేనా?

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున సోలో హీరోగా సిల్వర్ స్క్రీన్ పై కనిపించి చాలా కాలమే అయింది. రీసెంట్ గా వచ్చిన కూలీ, కుబేర వంటి చిత్రాల్లో నెగెటివ్ షేడ్స్ లేదా సైడ్ క్యారెక్టర్స్ కే పరిమితమైన నాగ్ నుంచి ఓ సాలిడ్ కమర్షియల్ మూవీ రావాలని అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆ వేచి చూసే రోజులకు ఎండ్ కార్డ్ పడినట్టే కనిపిస్తుంది.కెరీర్ లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ సినిమాను నాగార్జున సైలెంట్ గా సెట్స్ పైకి తీసుకెళ్లారు. కోలీవుడ్ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై స్వయంగా నాగార్జున గ్రాండ్ గా నిర్మిస్తున్నారు.గతేడాది ఎలాంటి హడావుడి లేకుండా పూజా కార్యక్రమాలు నిర్వహించిన మేకర్స్, అప్పటి నుంచి సీక్రెట్ గా షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఇప్పటివరకు పోస్టర్ గానీ, కాన్సెప్ట్ వీడియో గానీ విడుదల చేయకపోవడం విశేషం. ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. టాకీ పార్ట్ దాదాపు పూర్తి దశకు చేరుకున్నట్టు సమాచారం.షూటింగ్ పూర్తయ్యే వరకు కూడా సీక్రెట్ గా ఉంచాలన్నది నాగార్జున ప్లాన్. అందుకే మేకర్స్ ఎలాంటి అప్డేట్స్ ఇవ్వడం లేదు. అయితే సమ్మర్ చివరికి చిత్రీకరణ పూర్తి చేసి, దసరా టార్గెట్ గా గ్రాండ్ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. సరైన సమయానికి రిలీజ్ డేట్ ప్రకటించేలా నాగ్ ప్లాన్ చేసుకుంటున్నారు. టైటిల్ కూడా అప్పుడే అనౌన్స్ చేయనున్నారని సమాచారం.అయితే లాటరీ కింగ్ అనే టైటిల్ ను కూడా పరిశీలిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. అదే సమయంలో చిత్రంలో నాగార్జునకు జోడీగా టబు నటించనున్నట్టు ఇటీవల ఆయన కన్ఫర్మ్ చేశారు. వీరిద్దరి మధ్య రొమాంటిక్ యాంగిల్ కూడా ఉండనున్నట్లు సమాచారం. నాట్యం ఫేమ్ సుస్మితా భట్ మరో హీరోయిన్ గా ఎంపికైనట్టు ప్రచారం సాగుతోంది.కథ ఆధారంగా నాగ్ మూడు వేర్వేరు గెటప్స్‌లో కనిపిస్తారని, మొత్తం ముగ్గురు హీరోయిన్లు ఉంటారని టాక్. జోనర్ విషయానికి వస్తే యాక్షన్, ఎమోషన్స్ ఉన్న కథతో సినిమా రూపొందుతోందట.



# మాట నిలబెట్టుకున్న రామ్ చరణ్...

## 500 మంది డ్యాన్సర్లకు ఉచిత ఆరోగ్య బీమా

ఝగ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన ఉదార స్వభావాన్ని మరోసారి చాటుకున్నారు. టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌లోని సుమారు 500 మంది సభ్యులు, వారి కుటుంబాలకు ఉచితంగా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు ముందుకు వచ్చారు. గతంలో తన పుట్టినరోజు సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, హెల్త్ కార్డుల పంపిణీకి సంబంధించిన ప్రతిపాదనను తాజాగా ఆమోదించారు.

సినిమా షూటింగ్‌లలో ఎంతో శ్రమించే డ్యాన్సర్లు ప్రమాదాలకు గురైనప్పుడు లేదా అనారోగ్యం బారిన పడినప్పుడు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే సదుద్దేశంతో చరణ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ద్వారా ప్రతి డ్యాన్సర్ కుటుంబానికి సమగ్ర ఆరోగ్య బీమా అందనుంది. ఇందుకోసం ఆయన సుమారు రూ.50 లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది.తన తండ్రి, మెగాస్టార్ చిరంజీవి బాటలోనే సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న చరణ్, ఈ కార్యక్రమాన్ని తన భార్య ఉపాసనతో కలిసి పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం 'పెద్ది' వంటి భారీ చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ, సినీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంపై డ్యాన్సర్ సంఘాలు, పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. చరణ్ తీసుకున్న ఈ నిర్ణయం 500 కుటుంబాలకు వైద్యపరమైన భరోసా కల్పించిందని, ఆయన నిజమైన హీరో అని ప్రశంసిస్తున్నాయి.

# హైప్ క్రియేట్ చేసినా.. ప్రేక్షకులు ఆదరిస్తారా అన్నదే ముఖ్యం

## సినిమాల తీరుపై నటుడు విజయ్ సేతుపతి కామెంట్స్



తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ యాక్టర్ విజయ్ సేతుపతి. ప్రస్తుతం అరవింద్ స్వామితో కలిసి గాంధీ టాక్స్ సినిమాలో నటిస్తున్నాడు. సాదాసీదా నటనతో ప్రేక్షకులను కట్టిపడేయడం ఈ టాలెంటెడ్ నటుడి స్పెషాలిటీ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు మక్కళ్ సెల్వన్. ఈ రోజుల్లో చాలా మంది యాక్టర్లు, డైరెక్టర్లు తమ సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించేందుకు హైప్ క్రియేట్ చేసేందుకు ఏదో ఒక విషయాన్ని హైలెట్ చేయాలని ప్రయత్నిస్తుంటారని తెలిసిందే. విజయ్ సేతుపతి తన అప్‌కమింగ్ మూకీ సినిమా 'గాంధీ టాక్స్' గురించి మాట్లాడాడు.. డైలాగ్స్ లేకుండా ఎమోషన్స్‌తో ప్రేక్షకులతో దగ్గరయ్యేందుకు రెడీ అవుతున్నారు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి. ప్రేక్షకులకు వినోదం కోసం థియేటర్లకు వస్తారు కాబట్టి ఫిల్మ్‌మేకర్స్ ప్రేక్షకులు అర్థం చేసుకోలేని విధంగా సినిమా తీయొద్దని సూచించాడు విజయ్ సేతుపతి. ఓ వైపు ప్రయోగాలకు వెల్ కమ్ చెబుతూనే.. మరోవైపు ప్రేక్షకులు ప్రత్యేకించి డబ్బులు చెల్లించి సినిమా చూసేందుకు వస్తున్నప్పుడు వారికి ఖర్చు భారమనిపించేలా సినిమా ఉండకూడదని అన్నాడు విజయ్ సేతుపతి. గాంధీ టాక్స్ స్పెషల్ సినిమా ఏం కాదు.. కానీ సరికొత్త సినిమా చూసిన అనుభూతిని మాత్రం తప్పకుండా ఇస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. సినిమా సంప్రదాయ ఫార్మాట్ ను ఫాలో అవకపోవడంతో గాంధీ టాక్స్ చిత్రాన్ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో టీం మెంబర్స్ అంతా మొదట ఆందోళన చెందారని.. అయితే దగ్గరి స్నేహితులకు స్పెషల్ స్క్రీనింగ్ వేసిన తర్వాత పాజిటివ్ స్పందన వచ్చిందని.. దాంతో సినిమాపై నమ్మంక పెరిగిందన్నాడు విజయ్ సేతుపతి. అయితే వారిచ్చిన ఫీడ్ బ్యాక్ సినిమా మార్కెట్ కోసం ఉపయోగపడదని కూడా చెప్పాడు. టీం అంతా



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి

టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇటీవల ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. సంక్రాంతికి విడుదలై రూ. 360 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ సినిమా భారీ విజయానికి కృతజ్ఞతగా ఆయన స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడిన అనిల్ రావిపూడి, తన తదుపరి ప్రాజెక్ట్‌పై కీలకమైన అప్‌డేట్ ఇచ్చారు. తన నెక్స్ట్ సినిమాకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని, మరో 10 నుంచి 15 రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన చేస్తానని స్పష్టం చేశారు. దీంతో ఆయన తర్వాతి చిత్రం ఎవరితో ఉండనుందనే దానిపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం.. అనిల్ రావిపూడి తన తర్వాతి చిత్రాన్ని విక్టరీ వెంకటేశ్‌తో చేసే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇది భారీ మల్టీస్టారర్‌గా ఉండనుందని, ఇందులో తమిళ నటుడు కార్తీ లేదా మలయాళ స్టార్ ఫహద్ ఫాజిల్ కీలక పాత్రలో కనిపించవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు వినోదాత్మక చిత్రాలతో ఆకట్టుకున్న ఆయన, ఈసారి పూర్తి భిన్నమైన జానర్‌లో సినిమా తీసేందుకు స్క్రిప్ట్ వర్క్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

# హీరోగా దర్శకుడు.. నిర్మాతగా రజనీ కుమార్తె.. ఆసక్తికరంగా 'విత్ లవ్' ట్రైలర్




సూపర్ స్టార్ రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ నిర్మాణంలో ఓ కొత్త ప్రేమకథా చిత్రం రాబోతోంది. 'విత్ లవ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ సినిమాతో దర్శకుడు అభిషన్ జీవింత్ హీరోగా పరిచయం అవుతున్నారు. ఫిబ్రవరి 6న విడుదల కానున్న ఈ చిత్రానికి సంబంధించి తాజాగా తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. గతంలో 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రానికి దర్శకత్వం వహించి గుర్తింపు తెచ్చుకున్న అభిషన్, ఈ సినిమాతో కథానాయకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మదన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మలయాళీ నటి అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తోంది. విడుదలైన ట్రైలర్ చూస్తుంటే, ఇదొక స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన ప్రేమకథగా అనిపిస్తోంది. యువతను ఆకట్టుకునే భావోద్వేగాలు, అందమైన విజువల్స్, ఆహ్లాదకరమైన సంగీతం ట్రైలర్‌లో ఆకట్టుకుంటున్నాయి.ఈ సినిమాకు సీన్ రోల్డాన్ సంగీతం అందిస్తుండగా, శ్రేయాస్ కృష్ణ సినిమాటోగ్రాఫర్. కావ్య అనిల్, సచిన్ నాచిప్పన్, తేని మురుగన్ వంటి వారు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సూపర్ స్టార్ కుమార్తె నిర్మిస్తున్న ఈ ప్రేమకథా చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

# ప్రిన్సెస్ ఆఫ్ టాలీవుడ్ స్టన్నింగ్ లుక్



సూపర్ స్టార్ మహేష్ బాబు గారాల పట్టి సితార ఘట్టమనేనికి తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. ఈ ఫోటోషూట్ లో అంతర్జాతీయ జువెలరీ బ్రాండ్ పీఎంజే కు సితార ప్రమోషన్ చేస్తోంది. ఇక వేదికపై సితార ఘట్టమనేని గ్లింప్స్ చూపరుల దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. సితార వయసు కేవలం 13. ఇంత చిన్న వయసులో అంతర్జాతీయంగా వేవ్స్ క్రియేట్ చేస్తోందనే చెప్పాలి. మిరుమిట్లు గొలిపే డిజైనర్ దుస్తుల్లో మహేష్ గారాల పట్టీ సితార ఘట్టమనేని ఎంతో క్యూట్ గా, అందంగా కనిపిస్తోంది. తాజాగా విడుదలైన ప్రకటన వీడియోలో సితార అచ్చం ఒక ప్రొఫెషనల్ మోడల్ లాగా గొప్ప ఆత్మవిశ్వాసంతో కనిపించడం హైలైట్. అలా ఠీవిగా కెమెరా ముందు నిలుచున్న తీరు, కళ్లతోనే కోటి భావాలు పలికిస్తూ, అందంగా స్మైలిస్తూ ఒక ప్రొఫెషనల్ మోడల్ నే తలపించింది. భవిష్యత్ లో గొప్ప స్టార్ అయ్యే లక్షణాలు సితారలో కనిపిస్తున్నాయని ఈ లుక్ చూడగానే ఘట్టమనేని అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అందం, స్మైల్, ఎలివేషన్ పరంగా తన తండ్రికి తగ్గ వారసురాలు అంటూ కితాబిచ్చేస్తున్నారు.సితారకు ఇప్పటికే ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉంది. ఇంతకుముందు న్యూయార్క్ లోని -టైమ్స్ స్క్వేర్- బిల్ బోర్డ్ పై మెరిసిన అతి పిన్న వయస్కురాలిగా సితార రికార్డు సృష్టించింది. ఇక సితార లుక్ చూడగానే అచ్చం తన తండ్రిని తలపిస్తోందని చాలా మంది అభిమానులు కితాబచ్చేస్తున్నారు. ప్రిన్సెస్ ఆఫ్ టాలీవుడ్ అంటూ అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సితార చాలా చిన్న వయసులో మోడలింగ్ ద్వారా ఆర్జించిన 1 కోటి రూపాయల తొలి పారితోషికాన్ని తన తండ్రి చారిటీ కార్యక్రమాలకు డొనేట్ చేసేయడం నిజంగా ఆశ్చర్యపరిచింది. దీనిని చిన్నారుల గుండె ఆపరేషన్లకు ఖర్చు చేస్తున్నారు. మహేష్ తరహాలోనే సామాజిక సేవలో తాను సైతం అంటూ సితార ముందుకు వస్తోంది. తన జిజ్ఞాస అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.